మంచిమాట
ఎంత ఆస్తి ఉన్నా తినేది ఆహారాన్నే..
మనకెంత గుర్తింపు ఉన్నా అందరూ
చూసేది మంచిగుణాన్నే..
ఏ కులంలో పుట్టినా అందరూ చూసేది
మంచితనాన్నే..
మనదెంత గొప్పమతమైనా అందరూ
చూసేది మానవత్వాన్నే..
ధనముంటే ధనవంతుడు అంటారు..
అదే దానం చేస్తే భగవంతుడు అంటారు..!!

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 141 విశాఖపట్నం, 10 మార్చి 2026 మంగళవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

## వైకాపా హయాంలోని తప్పులను సరిదిద్దుతున్నాం: సీఎం చంద్రబాబు



**నంద్యాల, విశాఖ సమాచారమ్, మార్చి 9 :** వైకాపా హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసినట్లు గుర్తు చేశారు. రికార్డులు తారుమారు చేయకుండా పక్కాగా పట్టా ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్‌తో పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తున్నామన్నారు. నంద్యాల జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. కొత్తబురుజు గ్రామసభలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క పైసా కూడా అవినీతి లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాకే కొత్త పాసుపుస్తకాలు ఇస్తున్నామని, భవిష్యత్‌లోనూ ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

"గత ప్రభుత్వ హయాంలో మద్యాన్ని కల్తీ చేసి వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. పేదవాడి ఆరోగ్యం కంటే వాళ్లకు డబ్బులే ముఖ్యమా? తిరుమల ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారు. తిరుమల పవిత్రతను దెబ్బతీయాలని చూశారు. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించను. ఇతర మతాల సంప్రదాయాలను ⏭ తరువాయి 2లో..

## తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

**మంగళగిరి గ్రామీణం, విశాఖ సమాచారమ్, మార్చి 9 :** మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మహానాడు ప్రాంత ప్రజల దశాబ్దాల కలను మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. తాడేపల్లి పట్టణం సీతానగరం మహానాడు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. కృష్ణా నదికి ప్రకాశం బ్యారేజీ దిగువన కుడి వైపు 0.900 కి.మీ నుంచి 2.610 కి.మీ వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.294.20 కోట్లతో పనులు చేపట్టేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఇటీవల ఆమోదం తెలిపింది.

**హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్**

మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. తొలుత పెదవడ్లపూడి గ్రామానికి చేరుకున్న మంత్రికి స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం రూ.14.88 కోట్ల వ్యయంతో నిర్మించిన హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి పంపుల ⏭ తరువాయి 2లో..



## ఏపీ రైతులపై అత్యధిక అప్పుల భారం





**ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రైతులు దేశంలోనే అత్యధిక అప్పుల భారాన్ని మోస్తున్నారు. 2025, డిసెంబర్ 31 నాటికి ఏపీలో రైతన్నల నెత్తిన 3,75,254 కోట్ల రూపాయల అప్పుల భారం పడింది. ఈ పరిస్థితిని కేంద్ర వ్యవసాయశాఖ పార్లమెంట్‌లో అధికారికంగా వెల్లడించింది. లోక్ సభలో లిఖిత పూర్వక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానం ఇచ్చారు.

రైతుల పై 2,01,744 కోట్ల రూపాయల పంట రుణాల భారం ఉండగా, టర్మ్ లోన్ భారం 1,73,510 కోట్ల రూపాయలగా ఉంది. మొత్తం కలిపి రైతులపై 3,75,254 కోట్ల రూపాయల రుణ భారంగా మారింది. దేశంలో తమిళనాడు తర్వాత రుణభారంలో తల్లడిల్లుతున్నారు ఏపీ రైతులు.

ఫలితంగా దేశంలోనే రైతుల రుణభారంలో రెండో స్థానంలో ఏపీ ఉంది. చంద్రబాబు నాయుడు పరిపాలనలో రైతులకు ఆదరణ కరువు అన్న దానికి ఇది సంకేతంగా నిలుస్తుంది. అరకొరగా రైతులకు వాగ్దానాలు అమలు చేస్తుండటంతో ఏపీ రైతులపై అప్పుల భారం తడిపి మోపడైంది. ఇక పక్క రాష్ట్రం తెలంగాణలో రైతులపై 1,75,960 కోట్ల రూపాయల అప్పుల భారం ఉంది. తెలంగాణలో రైతులపై క్రాప్ లోన్ 95,167 కోట్లు రూపాయలు, 80,792 కోట్ల రూపాయల టర్మ్ లోన్‌గా ఉంది.

## ట్రంప్‌కు బానిసలా మోదీ.. ఖర్గే సంచలన వ్యాఖ్యలు



**కలబురిగి (కర్నాటక):** పశ్చిమాసియా సంక్షోభం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం, టారిఫ్ అంశాల్లో కేంద్రంలోని బీజేపీ వైఖరిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఒక నియంతగాను, ప్రధాని మోదీని ఆయనకు బానిసగాను అభివర్ణించారు. ట్రంప్ ఎప్‌స్టీన్ ఫైళ్లను అడ్డుపెట్టుకుని మోదీని ఆడిస్తున్నారన్నారు.

కర్నాటకలోని కలబురిగి జిల్లా చిత్తాపూర్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. 'ఇరాన్ సుప్రీం నేతను అమెరికా చంపేసింది. ఏకంగా దేశ నేతనే చంపేస్తే ఆ దేశం, ఇక ప్రపంచం సురక్షితంగా ఉంటుందా? ఇరాన్ నేత ఖమేనీ లేదా వెనెజువెలా నేత మదురో..ఇలా ఎవరైనా కావచ్చు. దేశాల నేతలను ఇలా బెదిరింపులకు గురిచేస్తే ప్రపంచంలో శాంతి అనేదే ఉండదు. అమెరికా తన అహంకారంతో అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కుతోంది' అని ఖర్గే మండిపడ్డారు. భారత్‌ను టారిఫ్‌ల పేరుతో బెదిరింపులకు గురి చేస్తూ అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయించిందన్నారు. మోదీ, ట్రంప్‌లు మన దేశాన్ని నాశనం చేస్తూ, అమెరికాకు దాసోహమనేలా చేస్తున్నారని ఆరోపించారు.

## సీనరేజ్ భారీగా పెంచిన ప్రభుత్వం

**అనంతపురం టౌన్, విశాఖ సమాచారమ్, మార్చి 9 :**

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిననాటి నుంచి నేటి వరకు ప్రజలపై వివిధ రకాలుగా భారం మోపుతూనే ఉంది. ఇప్పటికే రెండుమార్లు భూముల ధరలను పెంచి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పాతాళంలోకి నెట్టేసింది. విద్యుత్ వినియోగదారులపై సైతం డెవలప్‌మెంట్ చార్జీల పేరిట వేల రూపాయల భారం మోపింది. తాజాగా ఖనిజ రవాణాపై సీనరేజ్ ధరలను అమాంతం పెంచేసింది.

గతంతో పోలిస్తే 50 శాతం మేర సీనరేజ్‌ను పెంచింది. దీంతో క్వారీ నిర్వాహకులతో పాటు రోడ్డు మెటల్ కొనుగోలుదారులపై అదనపు సీనరేజ్ భారం పడనుంది. గత ప్రభుత్వంలో ఒక క్యూబిక్ మీటర్ రోడ్డు మెటల్ తవ్వి తరలిస్తే రూ.90 మేర సీనరేజ్ చెల్లించాల్సి ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం రూ.150కి పెంచింది.

అనంతపురం జిల్లా వ్యాప్తంగా 146 రోడ్డు మెటల్ క్వారీల్లో 120కిపైగా రన్నింగ్‌లో ఉన్నాయి. రోజువారీగా వేల క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్ తవ్వకాలు చేస్తున్నారు. ప్రస్తుతం పెంచిన ధరల మేరకు క్వారీ నిర్వాహకులు సీనరేజ్‌ను చెల్లిస్తున్నారు. గ్రానైట్‌పై సైతం సీనరేజ్‌ను పెంచేశారు. గ్రానైట్ రకాన్ని బట్టి కలర్, బ్లాక్, గెలాక్సీ తదితర రకాలపై రూ.240 నుంచి రూ.500 వరకు క్యూబిక్ మీటర్‌పై పెంచేశారు. ⏭ తరువాయి 2లో..






## ఏపీ మద్యం కుంభకోణం కేసు

### ఈడీ దర్యాప్తు షురూ

**విజయవాడ, విశాఖ సమాచారమ్, మార్చి 9 :** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య సోమవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. సుమారు 2 గంటల పాటు జరిగిన విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోగా.. ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం అక్రమాలతో ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.4 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు దర్యాప్తు సంస్థ అంచనా వేసింది. అప్పట్లో మద్యం విధానాన్ని పూర్తిగా మార్చివేయడం, ముడుపులు ఇచ్చిన వారికే మద్యం తయారీ అవకాశం కల్పించడంపై ఈడీ ప్రశ్నించినట్లు తెలిసింది.

ఆ ముడుపుల సొమ్ములు షెల్ కంపెనీల్లోకి మళ్లించి.. అక్కడి నుంచి నిందితుల ఖాతాల్లోకి వచ్చేటట్లు కుట్రపూరితంగా వ్యవహరించారన్న సమాచారంపైనా ఆరా తీసింది. అప్పటిదాకా ఉన్న పాపులర్ బ్రాండ్లను పక్కనపెట్టి.. కొత్త బ్రాండ్లను తీసుకురావడానికి గల కారణం ఏంటన్న దానిపై నిందితుల నుంచి ఈడీ సమాచారం రాబట్టే ప్రయత్నం చేసింది. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో తదుపరి విచారణకు రావాలని ఈడీ నిర్దేశించింది. ఇక మద్యం కుంభకోణంలో కీలక నిందితులు రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యకు చెందిన రూ.441.61 కోట్లకు పైగా ఆస్తుల్ని ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది.

## ఇథియోపియా సరిహద్దులో ఇండిగో విమానం యూటర్న్




**పశ్చిమాసియా, విశాఖ సమాచారమ్, మార్చి 9 :**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా దిల్లీ నుంచి మాంచెస్టర్ బయల్దేరిన ఇండిగో విమానం యూటర్న్ తీసుకుంది. ఇథియోపియా సరిహద్దులో ప్రవేశిస్తున్న సమయంలో గగనతల ఆంక్షల కారణంగా ఏడు గంటల పాటు ప్రయాణించిన విమానం వెనక్కి మళ్లాల్సి వచ్చినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది.

ఇండిగో తెలిపిన వివరాల ప్రకారం.. తమ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం సోమవారం తెల్లవారుజామున దిల్లీ నుంచి మాంచెస్టర్ బయల్దేరింది. పశ్చిమాసియాలో పలు దేశాల గగనతలాలు మూసి ఉండడంతో.. మరోమార్గంలో గల్ఫ్ ఆఫ్ అడెన్, ఆఫ్రికా మీదుగా ఏడు గంటలపాటు ప్రయాణించి ⏭ తరువాయి 2లో..

## ఇరాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం




**టెహ్రాన్:** ఇరాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. విదేశాల్లో ఉండి ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న తమ దేశ పౌరులకు వార్నింగ్ ఇచ్చింది. శత్రుదేశాలకు మద్దతు ఇస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపింది. దేశంలోని వారి ఆస్తులన్నీ జప్తు చేస్తామని హెచ్చరించింది. ఇరాన్ అటార్నీ జనరల్ కార్యాలయం సోమవారం ఈ మేరకు ప్రకటన చేసింది. ఇరాన్ ప్రభుత్వ నియంత్రణలో నడిచే ఐఆర్ఐబీ వార్తా సంస్థ కూడా ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపింది. విదేశాల్లో నివసిస్తూ సొంత దేశానికి శత్రువుల??లా పనిచేస్తున్న వారి ఆస్తులు స్వాధీనం చేయాలని ఆదేశించే అధికారం న్యాయస్థానానికి ఉందని ఇరాన్ న్యాయ వ్యవస్థ సైతం స్పష్టం చేసింది.

ఈ ప్రకటన న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ వార్తా సంస్థలో కూడా ప్రచురితమైంది. విదేశాల్లో ఇజ్రాయెల్ లేదా అమెరికా ప్రభుత్వాల కోసం జరిగే ఏదైనా ఇంటెలిజెన్స్ లేదా ఎస్పియోనాజ్ కార్యకలాపాలు జరిగితే ఆయా పౌరుల ఆస్తులు స్వాధీనం చేయడం పాటు మరణదండన కూడా విధించవచ్చని హెచ్చరించింది.

ఇరాన్‌కు వ్యతిరేకంగా తప్పులు చేసినట్లు నిర్ధారణ అయితే వదిలేది లేదని ఇరాన్ చెప్పింది. గత అక్టోబర్‌లో అమలు చేసిన చట్టం గురించి ప్రస్తావించింది. ⏭ తరువాయి 2లో..

## కొత్తగా రాహుల్ బంధు పథకం తెచ్చారు: కేటీఆర్



**సిరిసిల్ల, విశాఖ సమాచారమ్, మార్చి 9 :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగా రాహుల్ బంధు పథకం తెచ్చాడంటూ ఎద్దేవా చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రైతుబంధు పథఖం బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకం తెచ్చిండు అంటూ సెటైర్లు వేశారు. సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయిలు రాహుల్ గాంధీకి పంపించడమే రాహుల్ బంధు పథకం అంటూ విమర్శించారు. ఈరోజు(సోమవారం, మార్చి 9వ తేదీ) మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లను సిరిసిల్లలో కేటీఆర్ ఘనంగా సన్మానించారు. దీనిలో భాగంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే టైమ్‌లోన రైతుబంధు పడుతూ ఉండేదని, ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పటివరకూ ఎవరికైనా రైతుబంధు పడిందా? అంటూ అక్కడున్నవారిని ఉద్దేశించి ప్రశ్నించారు. సంవత్సరానికి వేయి కోట్లు కట్టి పదవి కాపాడుకుంటుండు. ఖమ్మం వెలుగుమట్లలో వెయ్యి ఇళ్లు కూల్చిండు.మహబూబ్‌నగర్‌లో దివ్యాంగుల ఇళ్ళు కూల్చారు. సీఎం సొంత ఇల్లు కొడంగల్ కోస్గిలో రెడ్డికుంటలో కట్టుకున్నాడు. రేవంత్ అన్న తిరుపతి రెడ్డి ఇల్లు దుర్గం చెరువులో ఉంది. 6 గారంటీలు నూరు రోజుల్లో అమలు చేస్తా అన్నాడు.. వెయ్యి రోజులు కావస్తున్నా అమలు ⏭ తరువాయి 2లో..

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రయోగాత్మక ఏఐ సేవలు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 9 :** కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంతో వైద్యసేవలను మరింత సమర్థంగా అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 18 అంకుర సంస్థలతో రాష్ట్రంలో ఎంపికచేసిన 18 ప్రభుత్వ వైద్యశాలల్లో పలురకాల వైద్యపరీక్షలు, సేవలను ప్రయోగాత్మకంగా అమల్లోకి తెచ్చింది. ఈ ఏఐ ఆవిష్కరణల ద్వారా ప్రాథమిక పరీక్షలతో వ్యాధులను గుర్తించి వైద్యసేవలు అందిస్తున్నారు. దీనివల్ల తక్కువ సమయంలో మెరుగైన వైద్యసేవలకు ఆస్కారం కలుగుతోంది. ఆయుష్మాన్ భారత్ ఐడీతో అనుసంధానం చేయడంతో.. ఎక్కడి నుంచైనా రోగి ఆరోగ్య వివరాల ఆధారంగా సులువుగా సేవలందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఏఐ ఆధారిత వైద్యసేవలు ఇలా..**

పైలట్ ప్రాజెక్టుల అమల్లో భాగంగా వైద్యులు, రోగుల మధ్య సంభాషణ రికార్డు చేసి దాని ఆధారంగా రుగ్మతపై నిర్ధారణకు వస్తున్నారు. సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి, తెనాలి జిల్లా ఆసుపత్రి, విశాఖలోని విక్టోరియా, కాకినాడ జీజీహెచ్, పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో ఈ సేవలు ప్రయోగాత్మకంగా అందిస్తున్నారు. శరీరానికి అమర్చే పరికరాల సాయంతో నవజాత శిశువులకు అత్యవసర సమయాల్లో తేలికపాటి ఆక్సిజన్ అందించడం.. వృద్ధుల్లో కీళ్లనొప్పులకు కారణాల గుర్తింపు లాంటి సేవలు అందుబాటులోకి తెచ్చారు.

విశాఖలోని మానసిక వైద్యశాల, అనంతపురం జీజీహెచ్, చాగల్లు పీహెచ్‌సీ, రాజానగరం ఉపకేంద్రాల్లో కొన్ని సంస్థలు ఏఐ అప్లికేషన్ల ద్వారా డయాగ్నస్టిక్ పరీక్షలు చేస్తున్నాయి. ప్రాథమిక దశలో గుండెజబ్బు, పిల్లల్లో న్యూరలాజికల్ డిజార్డర్లు, దగ్గు ద్వారా టీబీ గుర్తిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఏఐ కెమెరా ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గుర్తింపు, సూట్‌కేస్‌లో ఇమిడిపోయే పరికరాలతో కాటరాక్ట్, డయాబెటిక్ న్యూరోపతిలను గుర్తిస్తారు.

విజయవాడలోని జీజీహెచ్‌లో క్షయ గుర్తించడానికి ఆర్టీపీసీఆర్.. రక్తహీనత, లుకేమియా పరీక్షలు.. సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో మధుమేహం, కిడ్నీ, థైరాయిడ్, రక్తపరీక్షలు సైతం ఏఐ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. టెలిమెడిసిన్ ద్వారా రక్తనమూనాల అవసరం లేకుండా కంటి చిత్రంతో రక్తహీనత, స్టెతస్కోప్‌కు చిన్న పరికరం అమర్చి ఈసీజీ లేకుండా గుండె సమస్యలు గుర్తిస్తున్నారు. ఐసీయూలోని రోగులకు పరికరాలు అమర్చి బీపీ, పల్స్, శరీర ఉష్ణోగ్రతలు, ఆరోగ్యస్థితి పర్యవేక్షణ లాంటి సేవలను పాడేరు, కర్నూలు, అనంతపురం జీజీహెచ్‌లతో పాటు తిరుపతిలోని రుయా వైద్యశాలలో అందిస్తున్నారు.

**రోగుల వివరాలు ల్యాప్‌టాప్‌లో నమోదు చేస్తున్న వైద్యుడు**

**కొత్త ఆవిష్కరణల ఫలితాలపై విశ్లేషణ**

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో వైద్యసేవల్లో సాంకేతికతపై దృష్టి సారించింది. నూతన ఆవిష్కరణకు 'ఏపీ మెడ్క్ ఇన్నోవేషన్ ఛాలెంజ్' పేరుతో దరఖాస్తులు ఆహ్వానిస్తే.. 297 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన క్యాథ్ (కమిటీ ఫర్ అప్లైడ్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్) 18 సంస్థలను ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అవి అందించే సేవల ఫలితాలను క్యాథ్ విశ్లేషించాక.. సీఎం చంద్రబాబుకు నివేదిక అందజేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, కార్యదర్శి వీరపాండియన్ వెల్లడించారు.

# ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలి దుర్మరణం



**బత్తలపల్లి, విశాఖ సమాచారమ్, మార్చి 9 :** బస్సు రాగానే ఎక్కేందుకు ప్రయాణికుల నడుమ తోపులాట జరగడంతో ఓ వృద్ధురాలు అదే బస్సు కింద పడి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో ఆదివారం జరిగింది. కదిరికి చెందిన భాగ్యమ్మ(80) తన కోడలు మాధవితో కలిసి ఆదివారం ధర్మవరంలో సమీప బంధువుల ఇంట్లో శుభకార్యం చూసుకుని బత్తలపల్లికి చేరుకున్నారు.

నాలుగు రోడ్ల కూడలిలో కదిరి వెళ్లే బస్సు కోసం వేచి ఉండగా బస్సు రావడంతో ఎక్కే సమయంలో ప్రయాణికుల రద్దీ కారణంగా తోపులాట జరిగింది. భాగ్యమ్మ ప్రమాదవశాత్తు బస్సు వెనుక టైరు కింద పడింది. బస్సు ముందుకు కదలగానే ఆమె తలపై నుండి వెనుక చక్రాలు వెళ్లాయి. తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు కేకలు వేయడంతో బస్సు నిలిపివేశారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు.

**ఆర్టీసీ బస్సులో మహిళ మృతి**

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ శ్వాస ఆడక మృతి చెందింది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన ముప్పిడి జ్యోతిరెడ్డి (50) ఆదివారం జంగారెడ్డిగూడెంకు వెళ్లేందుకు గోపాలపురంలో కొవ్వూరు ఆర్టీసీ డిపో బస్సు ఎక్కింది. బస్సు ప్రయాణికులతో రద్దీగా ఉండగా జంగారెడ్డిగూడెం పాత బస్టాండ్‌కు వచ్చేసరికి జ్యోతిరెడ్డి స్పృహ తప్పి పోయిఉంది.

గమనించి 108-కు సమాచారమివ్వగా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్టు చెప్పారు. జ్యోతిరెడ్డి కుమారుడు తన తల్లి అనారోగ్యంతో ఉన్నారని, ఆమె మృతిపై అనుమానాలూ లేవని చెప్పి మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

# ట్రంప్‌నకు హైబీపీ తెప్పించిన ఇరాన్!

**ఇరాన్ :** ఇరాన్ అధికారికంగా మోజ్తాబా ఖమేనీని కొత్త సుప్రీం లీడర్‌గా ప్రకటించింది. ఆయన తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో మరణించిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో.. తీవ్ర తర్జన భర్జనల తర్వాత (మార్చి 8–9, 2026) ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఆయన వారసుడిగా మోజ్తాబానే ఎన్నుకుంది.

ఇరాన్ చరిత్రలో అరుదైన ఘట్టం చోటు చేసుకుంది. ఆ దేశ అత్యున్నత మతపరమైన మండలి తమ కొత్త నాయకుడిగా ఖమేనీ తనయుడు సయ్యద్ మోజ్తాబాను (అలీ ఖమేనీ రెండవ కుమారుడు)ని ఎన్నుకుంది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత మొదటిసారి సుప్రీం లీడర్ పదవి తండ్రి నుండి కుమారుడికి వారసత్వంగా వెళ్లడం ఇక్కడ ప్రముఖంగా చెప్పుకోదగ్గ విషయం.

అయితే ఇరాన్‌లో సాధారణంగా సుప్రీం లీడర్‌ను మతపరమైన మండలి ఎన్నుకుంటుంది. కానీ ఈసారి తండ్రి నుండి కుమారుడికి పదవి రావడం హెరిడిటరీ సక్సెషన్ (వంశపారంపర్య వారసత్వం)పై విమర్శలు వెల్లువెత్తవచ్చని అంతా భావించారు. దీనికి తోడు.. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్.. మోజ్తాబా ఎంపిక అంశంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇరాన్‌లో వారసత్వ ఎంపిక ఏ రకంగానూ చెల్లదని, మోజ్తాబా ఒక మూర్ఖుడు అని, ఆ పదవికి అనర్హుడని, ఇరాన్ కొత్త నాయకుడిని ఆ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జరపాలని, ఆ ఎంపికలో తమ దేశ ప్రమేయం(తనకు అనుకూలంగా ఉండాలనే..) ఉంటుందని ప్రకటించారు. వాషింగ్టన్ ఆమోదం లేకుండా ఇరాన్ గద్దెపై ఎవరు కూర్చున్నా, వారు ఎక్కువ కాలం నిలబడలేరని ఆయన హెచ్చరించారు.

కాగా, ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ చాలా తేలికగా తీసుకుంది. ప్రాంతీయ యుద్ధ పరిస్థితుల్లో.. మోజ్తాబా ఎంపికే సరైందని భావించింది. అయితే ఆ ప్రకటన తర్వాత ఇరాన్ అంతటా అనూహ్య పరిస్థితులు కనిపించాయి. వ్యతిరేకతకు బదులు.. ఇరాన్ ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆనందం వ్యక్తం చేశారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, సైనిక ప్రధాన సిబ్బంది మోజ్తాబాకు మద్దతు ప్రకటించారు. ఇది అగ్రరాజ్యం, ఇజ్రాయెల్ ఏమాత్రం ఊహించిన




ఉండకపోవచ్చు!.

56 ఏళ్ల వయసున్న మోజ్తాబా ఖమేనీ గతంలో ఎన్నికైన పదవులు చేపట్టకపోయినా, తన తండ్రి కార్యాలయం ద్వారా సైనిక, భద్రతా వ్యవస్థలపై ప్రభావం చూపుతూ వచ్చారు. అలాగే హెజ్‌బొల్లా లాంటి అమెరికా-ఇజ్రాయెల్ వ్యతిరేక గుంపులతోనూ ఆయన సంబంధాలు కలిగి ఉన్నారు. అయితే మోజ్తాబా, డొనాల్డ్ ట్రంప్ మధ్య సంబంధం తీవ్ర ప్రతిస్పందనలతో నిండింది. మోజ్తాబాపై పలు రాజకీయ(ఎన్నికల్లో అవకతవకలు, అవినీతి సంబంధిత) విమర్శలు ఉన్నా.. కరడుగట్టిన ట్రంప్ వ్యతిరేకి అనే ముద్ర కూడా ఉంది. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో మోజ్తాబా నియామకమే సరైందని భావించి.. అమెరికాకు ప్రత్యక్ష సవాలు విసిరింది ఇరాన్.

మొత్తంగా.. మోజ్తాబా నియామకంతో ఇరాన్ మతపరమైన నాయకత్వం "సమరాన్ని ఎంచుకుంది, రాజీని కాదు" అని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే ట్రంప్ మోజ్తాబాను "అంగీకరించలేని నాయకుడు" అని చెబుతున్నారు. కాబట్టి తాజా నిర్ణయం ఆయనకు మరింత మంట పుట్టించి తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేయించే అవకాశం లేకపోలేదు. అదే సమయంలో ఉద్రిక్తతలకు ధీటుగానే స్పందించాలనే ధోరణిని మోజ్తాబా కొనసాగించే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్‌లో జరిగిన నాయకత్వ మార్పు .. మధ్య ప్రాచ్యంలో(మిడిల్‌ఈస్ట్‌లో) ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం కనిపిస్తోంది.

# జీడిమామిడీ మధురమిక..




**రంపచోడవరం, విశాఖ సమాచారమ్, మార్చి 9 :** ఏజెన్సీలో జీడిమామిడి పంట విస్తీర్ణం పెంచేందుకు కార్యాచరణ సిద్ధమైంది. ఏటా జీడిమామిడి పిక్కలను బయట దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసి వస్తుండడంతో ఈ పంట తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో మొక్కలు నాటి వాటి విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల కేరళ రాష్ట్రం త్రిచూర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ అంశంపై జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు.

అల్లూరి జిల్లాలో జీడిమామిడి పంటను మరింతగా ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన చర్యలను డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పీసీ వెంగయ్య వివరించారు. ఇందులో భాగంగా గిరిజన ప్రాంతంలో జీడిమామిడి అభివృద్ధికి గిరిజనులకు ఉచితంగా మొక్కల పంపిణీ, పాత తోటల స్థానంలో అంటు మొక్కలు వేయించడం, వాటికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిచడం వంటి విషయాలపై ప్రణాళికలు రూపొందించారు.

**పరిశ్రమలకు ప్రోత్సాహం**

జీడిమామిడి ఉత్పత్తులకు పరిశ్రమలను ప్రోత్సహించడం, జీడిమామిడి పండు నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడం, జీడిమామిడి తోటల పెంపకం, చీడ పీడల నుంచి రక్షణకు శిక్షణ ఇవ్వడం, జీడిపప్పు, జీడిపండు ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించడం, సబ్సిడీ ఇవ్వడం, ఏజెన్సీలోని ఉత్పత్తులకు ఆర్గానిక్ బ్రాండ్ కల్పించడం తదితర చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు శిక్షణ ఇచ్చేందుకు కొచ్చిలోని జీడి మామిడి అభివృద్ధి సంస్థకు అవకాశం కల్పించారు.

**పండ్లతో అనేక ఉత్పత్తులు..**

జీడిమామిడి పండ్లతో జెల్లీ, వైన్, పచ్చళ్ల వంటి అనేక రకాలైన ఆహార పదార్థాలు తయారు చేయవచ్చు. జీడిమామిడి పండులో విలువైన పోషకాలు ఉన్నాయి. ఇందులో విటమిన్ సీ ఎక్కువగా ఉంటుంది. మిగతా పండ్లతో పోల్చితే నాలుగు రేట్లు అధికంగా ఉంటుంది. ఐరన్, మాంస కృత్తులు 0.15 శాతం, కొవ్వు పదార్థాలు 0.5 శాతం, పీచు పదార్థాలు 0.5 నుంచి 1 శాతం ఉంటాయి. జీడిమామిడి పండ్లు తీయగా ఉన్నప్పటికీ నేరుగా తింటే పినాలిక్స్ వల్ల గొంతులో కీచు ఏర్పడుతుంది. దీనిని అధిగమించి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్తలు చర్యలు చేపడుతున్నారు.

**ఏటా 40 లక్షల టన్నులు వృధా ..**

జీడిగింజ ఉత్పత్తికి మాత్రమే జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు. జీడిగింజ కంటే 8 నుంచి 10 రెట్లు పరిమాణంలో ఉన్న ఆ పండు మాత్రం వృథాగా తోటల్లో మిగిలిపోతోంది. ఏటా 40 లక్షల టన్నుల జీడిమామిడి పండ్లు తోటల్లో వృథా అవుతున్నాయి. జీడిమామిడి పండులో 85 శాతం రసం, 10 శాతం చక్కెర ఉంటాయి. పండు రసంలో ఫ్రక్టోజ్, గ్లూకోజ్, సుక్రోజ్, మాల్టోజ్, మాలిక్ ఆమ్లం ఉంటాయి.

**తోటల అభివృద్ధికి కృషి**

జిల్లాలో 50 వేల ఎకరాల్లో జీడిమామిడి పంట సాగులో ఉంది. ఈ విస్తీర్ణం మరింత పెంచేందుకు ఇటీవల కేరళలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఇందు కోసం పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించనున్నారు. జీడిమామిడి పిక్కల కంటే ఆ పండ్ల లభ్యత ఎక్కువగా ఉంటుంది. కాని వాటి వల్ల ఇప్పటి వరకు ఇక్కడ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. చెట్ల నుంచి పిక్కలను సేకరించి పండ్లను వదిలేయడంతో అవి వృథాగా పోతున్నాయి.

ఏజెన్సీలో రైతులు కేవలం పిక్కలను మార్కెట్ చేయడంపై మాత్రమే దృష్టి పెట్టారు. కానీ ఆ పిక్కల నుంచి పప్పు సేకరణకు ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోలేదు. జాతీయ స్థాయిలో జరిగిన సమావేశంలో రైతులు కొత్తగా జీడిపప్పు పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం లభించనుంది. దేశంలో కేరళ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు జీడిమామిడి పంట ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ముందున్నాయి. తాజాగా జీడిమామిడి అభివృద్ధి సంస్థ తీసుకున్న నిర్ణయంతో ఏజెన్సీ ప్రాంతంలో జీడిమామిడి అభివృద్ధికి బాటలు పడనున్నాయి.

**గిరిజనుల ఆర్థిక ప్రగతికి ..**

గిరిజనుల ఆర్థిక ప్రగతికి జీడిమామిడి పంటతో విలువ అధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారిస్తున్నాం. పిక్క నుంచి వచ్చే మొక్కల వల్ల దిగుబడి అంతగా రాదు. వాటి స్థానంలో అంటు మొక్కలను రైతులకు ఇస్తాం. జీడిమామిడి పంట ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో ఆర్థికంగా ఉపయోగ పడేలా కార్యచరణ, శిక్షణ ఇస్తాం.

**-- పీసీ వెంగయ్య, హెచ్‌ఆర్‌ఎస్ అధిపతి, ఫుడ్ సైంటిస్ట్, పందిరిమామిడి**


# దేవుడికి దాతలు భూములిస్తారు మీరు దేవుడికి భూములు అమ్ముతారు

**తిరుపతి, విశాఖ సమాచారమ్, మార్చి 9 :** తిరుమల శ్రీవారిని కూడా రాజకీయ అవసరాలకు వాడుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్ర చేస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. టీటీడీ చరిత్రలో ఆలయాలకు భూమి కొన్నది లేదని, కానీ అమరావతి వెంకటాయపాలెంలో టీటీడీ ఆలయానికి భూమి కొన్నారని మండిపడ్డారు.

వెంకటాయపాలెంలో దేవాలయ నిర్మాణానికి స్థలాన్ని దాతలు కానీ, సంస్థలు కానీ ఇస్తాయని, మరి దాన్ని పక్కనపెట్టి భూమి కొనడం ఏంటని ప్రశ్నించారు. ఈరోజు(సోమవారం, మార్చి 9వతేదీ) తిరుపతి నుంచి మాట్లాడిన భూమన.. దేవుడికి దాతలు భూములిస్తారు.. మీరు దేవుడికి భూములు అమ్ముతారు.ఉచితంగా టీటీడీ భూమి కోరితే సవాలక్ష నిబంధనలు పెట్టారు. వివిధ సంస్థలకు మాత్రం ఉచితంగా భూములు కేటాయించారు. టీటీడీ రూ. 12 కోట్ల సొమ్మును సీఆర్డీఏ వెనక్కి ఇవ్వాలి. మహిళల జోలికొచ్చిన టీటీడీ చైర్మన్‌ను చూస్తే అసహ్యించుకుంటున్నారు' అని విమర్శించారు.

**ఎవరూ ఈ సాహసం చేయలేదు..**

నవీ ముంబైలో అప్పటి సీఎం ఏక్ నాథ్ షిండే వెంకటేశ్వర స్వామి ఆలయంకు ఉచితంగా స్థలం కేటాయించారు. జమ్మూకశ్మీర్‌లో




లెఫ్టినెంట్ గవర్నర్ జమ్మూలో ఉచితంగా శ్రీవారి ఆలయం నిర్మాణంకు ఉచితంగా స్థలం కేటాయించారు. పల్లవ మహారాణి సమవాయి, చోళ రాణి పరాంతక మణి, యాదవ రాజులు, విజయనగర రాజులు శ్రీవారికి విలువైన కౌనకాలు, ఆస్తులు ఇచ్చారు. టీటీడీ చరిత్రలో ఏ ఒక్క చోట దేవాలయాలకు స్థలం కొన్నది లేదు. సీఎం చంద్రబాబు అమరావతి వెంకటాయ పాలెంలో 25 ఎకరాలు వెంకటేశ్వర స్వామి ఆలయంకు స్థలం కొనుగోలు చేశారు. ఎకరా 50 లక్షలకు అమ్మారు. రూ. 12 .50 కోట్లు ధర చెల్లించారు. ప్రపంచంలో ఏ ఒక్కరు ఇలాంటి సాహసం చేయలేదు. ఆర్థికంగా వివిధ సంస్థలకు ఏపీ ప్రభుత్వం భూములు కేటాయింపు ఉచితంగా చేసింది. ఏపీ హ్యూమన్ రిసోర్స్ సంస్థకు ఉచితంగా స్థలాలు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూటల్ డిజైన్ ఉచితంగా భూమి కేటాయింపు చేసింది. మరి అమరావతిలో టీటీడీ ఆలయం నిర్మాణంకు రూ. 12.50 కోట్లతో కొనుగోలు చేశారు. వ్యాపార రాజధాని కు వెంకటేశ్వర స్వామి వాణిజ్య అవసరాలకు వాడుకున్నారని స్పష్టంగా అర్థం అవుతోంది. తమిళనాడు చెన్నై జీ స్క్వేర్ రియల్ ఎస్టేట్ సంస్థ స్థలంలో వెంకటేశ్వర ఆలయం నిర్మాణం చేస్తున్నారు. చెన్నై ఆలయం విస్తరణకు టీటీడీ దాతలు సహాయంతో చేశారు. నటి కాంచన ఇచ్చిన స్థలంలో అమ్మవారు ఆలయం నిర్మాణం చేశారు.

**బీఆర్ నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారు..**

గత ఏడాది కాలంగా మీరు చేస్తున్న అరాచకాలతో, హిందువులను అపహాస్యం చేస్తున్నారు.. భగవద్గీత పై రూ. 50 కోట్లు ఖర్చు అని బీఆర్ నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కోటి పుస్తకాలకు 52 లక్షలు పుస్తకాలు ప్రింట్ అయ్యాయి, భగవద్గీతకు ఇప్పటివరకు మూడున్నర కోట్లు ఖర్చు చేశారు. పుస్తకానికి .3 రూపాయలు 71 పైసలు ఖర్చు అయ్యింది. బీఆర్ నాయుడు బుకాయిస్తే సరిపోదు.. పదవికి రాజీనామా చేయాలి' అని డిమాండ్ చేశారు.

# సీనరేజ్ భారీగా పెంచిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా వ్యాప్తంగా 193 గ్రానైట్ క్వారీల్లో ప్రస్తుతం 100కు పైగా నడుస్తున్నాయి.

**పెరగనున్న రోడ్డు మెటల్ ధరలు**

సీనరేజ్ పెరగడంతో రోడ్డు మెటల్ ధరలను సైతం క్వారీ నిర్వాహకులు పెంచే ఆలోచనలో ఉన్నారు. ప్రస్తుతం 40 ఎంఎం మెటల్ ఒక యూనిట్‌కు రూ.2,500లు, 20 ఎంఎం యూనిట్‌కు రూ.3 వేల చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నారు. సీనరేజ్ పెంపుతో రోడ్డు మెటల్ ధరలను సైతం పెంచేందుకు క్వారీ నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు. క్వారీ నిర్వాహకుల అసోసియేషన్ సమావేశం నిర్వహించి.. ఎంతమేర పెంచాలో నిర్ణయం తీసుకొని వారం రోజుల్లో పెంచనున్నట్లు సమాచారం. రోడ్డు మెటల్ ధరలు పెరిగితే భవన నిర్మాణ యజమానులు, రోడ్డు కాంట్రాక్టర్లు, బిల్డర్లపై అదనపు భారం పడనుంది.

**సీనరేజ్ పెరిగింది**

ఖనిజాలపై సీనరేజ్‌ను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిన మాట వాస్తవమే. పెంచిన సీనరేజ్ ధరలను ఇప్పటికే అమలు చేస్తున్నాం. రోడ్డు మెటల్‌పై క్యూబిక్ మీటర్‌కు రూ.60 మేర పెంపు చేశారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ ధర రూ.150 మేర ఉంది. గ్రానైట్‌పై సైతం స్వల్పంగా పెంచారు. గ్రానైట్ సైజులను బట్టి సీనరేజ్ ధరలు పెరగనున్నాయి.

**– ఆదినారాయణ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్**

# ఇథియోపియా సరిహద్దులో ఇండిగో విమానం యూటర్న్

(మొదటి పేజీ తరువాయి)

ఇథియోపియా సరిహద్దుకు చేరుకుంది. మరో నాలుగు గంటల్లో మాంచెస్టర్ చేరుకోవాల్సి ఉండగా.. చివరి నిమిషంలో ఇథియోపియా ప్రభుత్వం గగనతల ఆంక్షలు విధించింది. దీంతో విమానం వెనక్కి మళ్లాల్సి వచ్చింది. ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించే అవకాశాలపై సంబంధిత అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు విమానయాన సంస్థ అధికారులు వెల్లడించారు.

# ఇరాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఆ చట్టం ప్రకారం.. ఇజ్రాయెల్, అమెరికా లేదా ఇతర శత్రు దేశాలు లేదా సంస్థలకు అనుకూలంగా తమ పౌరులు పనిచేస్తే చేస్తే ఆస్తుల స్వాధీనంతో పాటు ఇస్లామిక్ పీనల్ కోడ్ ప్రకారం ఇతర చట్టపర శిక్షలు వర్తిస్తాయని తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభమైంది. ఆ రోజు అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ నగరాలపై సైనిక దాడులు ప్రారంభించాయి. అప్పటి నుంచి.. విదేశాల్లో ఉంటున్న తమ దేశ పౌరులపై కూడా ఇరాన్ దృష్టి పెట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు సుప్రీం లీడర్ అలీ ఖమేనీ సహా 1,200 మందికి పైగా ప్రజలు మరణించారు. 10,000 మందికి పైగా ప్రజలు గాయపడ్డారని ఇరాన్ అధికారులు తెలిపారు.

# కొత్తగా రాహుల్ బంధు పథకం తెచ్చారు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదు. అనాడు మూడో పంటకు రైతుబంధు వేయాలన్నారు.. ఇవాళ మూడో నెల వచ్చినా రైతుబంధు వేయడంలేదు. ఆడపిల్ల పెళ్ళికి కళ్యాణ లక్ష్మీ కింద లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తా అన్నారు. పంట పంటకు బోనస్ ఇస్తా అన్నారు. అత్తలకు 4 వేలు కోడలు 2,500 ఇస్తా అన్నాడు ఇప్పటి వరకు ఇచ్చిండా..?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు కేటీఆర్.

# తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ పథకం ద్వారా మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని 25,344 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు పంపులను అమర్చారు. ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయించారు.

# వైకాపా హయాంలోని తప్పులను సరిదిద్దుతున్నాం: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కాపాడతాం. కుట్రపూరితంగా మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. ప్రజల జీవితాలు, ఆరోగ్యంతో ఆడుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అంతా కల్తీ.. కుంభకోణాలే. ముఠాలు వద్దు.. గ్రామాల ప్రశాంతతే ముద్దు అని అందర్నీ కలిపా. రౌడీయిజం, ముఠా కక్షలు లేకుండా చేశాం. రాయలసీమను రతనాల సీమగా మారుస్తా. ఉద్యానవనంగా చేసి చూపిస్తాం. ఇక్కడి ఉత్పత్తులకు ప్రపంచ స్థాయిలో మార్కెట్ కల్పిస్తాం" అని చంద్రబాబు అన్నారు.

# హైరిస్క్ జోన్‌లో కైలాసగిరి, సింహాచలం



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖపట్నం: పర్యాటకులను ఆకర్షిస్తున్న కైలాసగిరి.. సింహాచలం పర్వత శ్రేణులకు ముప్పు పొంచి ఉంది. ఆయా ప్రాంతాల్లో భవిష్యత్తులో కొండ చరియలు విరిగిపడే ప్రమాదముంది. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కన్నంనాయుడు నేతృత్వంలో డాక్టర్ సీహెచ్ వాసుదేవరావు, వై.ప్రియాంక, టి.రోహిణి నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (జీఐఎస్)కు చెందిన జియోస్పేషియల్ సామర్థ్యాలు, కృత్రిమ మేధ అంచనాలను అనుసంధానిస్తూ ఈ పరిశోధన చేపట్టారు. మొత్తం పర్వతాల్లో కైలాసగిరి, సింహాచలం శ్రేణులున్న దాదాపు 15 శాతం భూభాగాన్ని హైరిస్క్ జోన్‌గా పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు పలు సూచనలు కూడా చేశారు. దెబ్బతింటున్న స్థిరత్వం..: విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రహదారులు, గృహ నిర్మాణాలు, ఇతర కార్యకలాపాల కోసం కొండ వాలులో తవ్వకాలు జరుపుతున్నారు. ఈ వేగవంతమైన విస్తరణ పక్కనే ఉన్న తూర్పు కనుమల్లోకి చొచ్చుకెళ్తోంది. ఇది సున్నితమైన కొండవాలు స్థిరత్వాన్ని మరింత దెబ్బతీస్తోంది. ఖొండాలైట్' శిలా నిర్మాణాలతో కూడిన ఎత్తయిన పర్వతాలు సహజంగానే కొండ చరియలు విరిగి పడే స్వభావాన్ని కలిగి ఉంటాయి. విస్తృతమైన భవన నిర్మాణాలు, వృక్ష సంపద తొలగింపు, సహజ నీటి ప్రవాహ మార్గాలకు అంతరాయం తదితర మానవ చర్యలు పర్వత వాలులో సహజ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా కొండ చరియలు విరిగిపడే ప్రమాదం క్రమంగా పెరుగుతుంది.

**కొండవాలులో నిర్మాణాలు..**

హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, వెంకోజీపాలెం, సీతమ్మధార, తాటిచెట్లపాలెం, కైలాసపురం, కంచరపాలెం, మాధవధార, మురళీనగర్, గోపాలపట్నం, మల్కాపురం కొండవాలు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఇళ్లు నిర్మించారు. నైరుతి, ఈశాన్య రుతుపవనాల కాలంలో నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆ సమయంలో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. సూచనలిలా.. రియల్‌టైమ్ వర్షపాత డేటాను సేకరించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థను బలోపేతం చేయాలి. హైరిస్క్ జోన్లలో భవన నిర్మాణాలకు నిబంధనలు కఠినతరం చేయాల్సిన అవసరముంది. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు తలపెడితే తప్పనిసరిగా భూస్థాయిలో సమగ్ర జియో-మెకానికల్ పరీక్షలు నిర్వహించాలి.కొండవాలును పటిష్ఠం చేసేందుకు నిపుణుల పర్యవేక్షణలో గ్రౌండ్ యాంకరింగ్, స్ట్రక్చరల్ బారియర్స్ వంటి పద్ధతులు అమలు చేయాలి.

# పేదల స్థలాల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

**వన్‌టౌన్, విశాఖసమాచారం:** వన్‌టౌన్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గత ఏడాది డిసెంబరుతో గడువు ముగియగా దాన్ని ఈ ఏడాది డిసెంబరు 31 వరకు పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్రమణలతో పోలిస్తే వచ్చిన దరఖాస్తులు చాలా తక్కువగా ఉన్నాయి. తగిన ఆధారాలు లేకపోవడం ఒక కారణమైతే ఆక్రమణ కింద దరఖాస్తు చేయడం ఎందుకులే అని మిన్నకున్న వారూ ఉన్నారు. గాజువాక ప్రాంతానికి..: గాజువాక రెవెన్యూ పరిధిలో జీవో నెంబరు-45 కింద ఆక్రమణల క్రమబద్ధీకరణ గడువు గత ఏడాదితో ముగిసింది. మరోసారి ఈ ఏడాది జూన్ 30 వరకు దరఖాస్తు చేయడానికి రెవెన్యూశాఖ అవకాశం కల్పించింది. జీవో నెంబరు-45 కింద ఇప్పటి వరకు 2075 దరఖాస్తులు అధికారులకు అందాయి. వాటిల్లో 721 మంది ఆస్తులను

| | |
|---|---|
| వచ్చిన మొత్తం దరఖాస్తులు: 10,342 | పరిశీలనలో ఉన్నవి: 6,190 |
| ఆమోదించినవి: 2,880 | |
| తిరస్కరించినవి: 1,272 | |

క్రమబద్ధీకరించారు. మరో 226 తిరస్కరించగా 1,128 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి.దఈ పత్రాలు తప్పనిసరి.. : రిజిస్టర్ డాక్యుమెంట్, ఆస్తి పన్ను రసీదు, కరెంటు బిల్లు రసీదు, నీటి పన్ను రసీదు, ఆక్రమణగా గుర్తించే ఇతర పత్రాలేవైనా. చెల్లించాల్సిన రుసుం ఇలా.. 150 గజాలలోపు : ఉచితంగానే క్రమబద్ధీకరిస్తారు. 151-300.. : బేసిక్ విలువపై 15 శాతం. రిజిస్ట్రేషన్ ఛార్జీలు 50 శాతం. 301-450..: బేసిక్ విలువపై 100 శాతం. రిజిస్ట్రేషన్ ఛార్జీలు 50 శాతం. 450 గజాలపైన : బేసిక్ విలువపై 5రెట్లు. పూర్తి రిజిస్ట్రేషన్ ఛార్జీలు.

**మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు..**

| మండలం | దరఖాస్తులు |
|---|---|
| ఆనందపురం | 680 |
| భీమిలి | 421 |
| విశాఖ గ్రామీణం | 2,892 |
| సీతమ్మధార | 413 |
| పద్మనాభం | 53 |
| ములగాడ | 656 |
| గోపాలపట్నం | 1,467 |
| మహారాణిపేట | 7 |
| గాజువాక | 1,294 |
| పెదగంట్యాడ | 772 |
| పెందుర్తి | 1,687 |

# అంగన్‌వాడీల్లో మెనూ మార్పు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటివరకు ఇస్తున్న మెనూలో మార్పులు చేసింది. కొత్త మెనూతో పిల్లలకు మరింత పోషకారం అందించనుంది. పోషకాహారం లోపాన్ని నివారించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. బాలామృతంతోపాటు చిన్నారులకు మధ్యాహ్నం అందించే మెనూలో మార్పులు తీసుకువచ్చింది. జిల్లాలో 9 ప్రాజెక్టుల పరిధిలో 1908 కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు, బాలింతలు 15వేల మంది, చిన్నారులు 45 వేల మంది పైగా ఉన్నారు. బాలామృతం రెండు రకాలుగా ఉండనుంది. ప్రస్తుతం ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు ఒకే రకమైన బాలామృతాన్ని నెలకు 2.5 కేజీల మేర పంపిణీ చేస్తున్నారు. ఇక నుంచి జూనియర్, సీనియర్ ప్రాతిపదికన తీసుకొని వేర్వేరుగా పంపిణీ చేయనున్నారు. బాలామృతంలో మార్పులు... జూనియర్ బాలామృతం కింద 7 నుంచి 12 నెలల పిల్లలకు కాల్చిన గోధుమలు, వేరుసెనగ, ఆయిల్, కందిపప్పుతో కూడిన పిండిని నెలకు 1.5 కేజీల మేరకు పంపిణీ చేస్తారు. ఇక 13 నెలల నుంచి 36 నెలల పిల్లలకు సీనియర్ బాలామృతం కింద కాల్చిన గోధుమలు, వేరుసెనగ, ఆయిల్, చిక్కీలతో కూడిన పిండిని 2.5 కేజీల చొప్పున ఇవ్వనున్నారు. 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు వారికి ఇంటికే ప్యాకెట్లు పంపిణీ చేస్తారు. ఈ మేరకు పంపిణీ చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. త్వరలో కేంద్రాల్లో కొత్త మెనూ ప్రారంభించి చిన్నారులకు పోషకాహారం ఇవ్వనున్నారు. పులిహోరకు బదులుగా ఎగ్ ఫ్రైడ్‌రైస్ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు మధ్యాహ్న సమయంలో వారానికి ఒకసారి పులిహోర అందిస్తున్నారు. కొత్త మెనూలో పులిహోరకు బదులు వారంలో రెండు సార్లు ఎగ్ ఫ్రైడ్‌రైస్ పిల్లలకు అందిస్తారు. అదేరోజు సాయంత్రం ఉడికించిన సెనగలు స్నాక్స్‌గా చిన్నారులకు ఇవ్వనున్నారు. పూర్తిగా బలవర్ధకమైన ఆహారం అందించి చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తరిమికొట్టనున్నారు. పులిహోరతో విసుగు చెందిన చిన్నారులకు ఎగ్‌ఫ్రైడ్‌రైస్ కొత్త రుచిని అలవాటు చేస్తారు. చాలామంది పులిహోర తినడానికి ఇష్టపడటం లేదు. ఎగ్‌ఫ్రైడ్ రైస్ అయితే అందరూ ఇట్టే లొట్టలు వేసుకొని తింటారనే అభిప్రాయంతో ఈ మార్పులు తీసుకువచ్చారు.

# 'పింక్ సఖి'తో క్యాన్సర్‌పై అవగాహన




**పెదవాల్తేరు, విశాఖసమాచారం:** పెదవాల్తేరు, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాహుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'పింక్ సఖి శారీ వాక్' పేరిట ఆదివారం బీచ్‌రోడ్డులో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సినీ నటి, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణలోకి వస్తుందని, ధైర్యంగా ఉంటే దీన్ని జయించవచ్చునని అన్నారు. ప్రభుత్వ క్యాన్సర్ నివారణ సలహా కమిటీ సభ్యురాలు డాక్టర్ కె.శిల్ప మాట్లాడుతూ దీని నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. అనంతరం మహిళలు చేపట్టిన సామూహిక జుంబా నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు సెల్ఫీ కాంటెస్టు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్వప్రియా ఫంక్షన్‌హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు వెలగపూడి ఉమామహేశ్వరరావు, శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ అధినేత డాక్టర్ జి.సాంబశివరావు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, డాక్టర్ మురళీకృష్ణ, విశాఖ వేలీ స్కూల్ ప్రిన్సిపల్ ఈశ్వరి ప్రభాకర్, జిల్లా కలెక్టర్ సతీమణి దివ్య ప్రసాద్, రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ అనంతరామ్ గణపతి, వైస్ ఛైర్‌పర్సన్ మీనాక్షి అనంతరామ్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** కలెక్టరేట్, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూ. 10 వేల నుంచి రూ.10 కోట్ల వరకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను మహిళా పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సి.ఎం.రమేశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ముందుగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వివిధ రకాల పదార్థాలను రుచి చేసి అభినందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మహిళలు నేడు ఇంటికి పరిమితం అవకుండా విద్య, ఐటీ, వ్యాపారం, సేవా రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఆర్థికంగా బలపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానికంగా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహిళలు బ్యాంకు రుణాలు పొందడంలో ఇబ్బందులు ఉంటే నేరుగా తన కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. సంయుక్త కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ మాట్లాడుతూ మహిళలకు ఆత్మవిశ్వాసం ఆయుధం కావాలన్నారు. భయం వీడి స్థిరమైన గొంతుతో సమస్యలపై మాట్లాడాలన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక డ్రైవ్‌లా జరుగుతోందన్నారు. అనంతరం మహిళలకు వివిధ రకాల యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. పలువురు మహిళలు రుణం తీసుకొని వ్యాపారాలు స్థాపించి సాధించిన విజయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, జిల్లా సచివాలయ అధికారిణి మంజులవాణి పాల్గొన్నారు.

# పల్లెల్లో కొందరికే పండగ



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** పాయకరావుపేట, నర్సీపట్నం గ్రామీణం, నక్కపల్లి, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, ఆర్థిక సంవత్సరం మరికొద్దిరోజుల్లో ముగియనుంది. అభివృద్ధి పనులకు మంజూరు చేసిన నిధులు నెలాఖరులోగా ఖర్చు చేయకుంటే మురిగిపోయే ఆస్కారం ఉంది. ముఖ్యంగా పల్లెల్లో రహదారి సదుపాయాలకు పెద్దపీట వేసే లక్ష్యంతో పల్లె పండగ పనులకు భారీగా నిధులు విడుదలయ్యాయి. గడువు తక్కువగా ఉండటంతో పనులు ఆదరబాదరగా చేస్తున్నారు. ముఖ్యంగా చాలాగ్రామాల్లో వందలాది మంది నివాసం ఉండే ప్రాంతాల్లో ఈనాటికీ మట్టిరోడ్లే ఉన్నాయి. కానీ పనుల ఎంపికలో నాయకుల మాటలే చెల్లుబాటు అవుతుండటంతో ఒకరిద్దరికి తప్ప ఉపయోగపడని పనులనూ జాబితాలో చేర్చేశారు. సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీల పేరుతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఈనెల 15 లోగా పనులు ముగించాల్సి ఉండటంతో డ్రైనేజీలను గాలికొదిలేసి.. రోడ్లు వేసి చేతులు దులుపుకొంటున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇదే తీరు కొనసాగుతోంది. నర్సీపట్నం నియోజకవర్గంలో తొలివిడత పల్లెపండగలో రూ. 31కోట్లు వెచ్చించి 473 సిమెంటు రోడ్లేశారు. కె.ఎల్.పురంలో రూ. 8 లక్షలతో నిర్మించిన రోడ్డు పక్క కేవలం ఒక్కటంటే ఒక్క ఇల్లు మాత్రమే ఉంది. ఇరువైపులా పంటభూములే ఉన్నాయి. ఈ పంచాయతీ శివారు చినలక్ష్మిపురంలో రూ. 2.8 లక్షలతో మూడు రోడ్లేస్తున్నారు. దీంట్లోని ఓ రోడ్డు ఒక ఇంటికోసం మాత్రమే వేస్తున్నారు. మాకవరపాలెం మండలం జంగాలపల్లిలో మూడిళ్లకోసం ఓ రోడ్డు వేశారు. ప్రస్తుతం మూడిళ్లే ఉన్నా రోడ్డుంటే ఇల్లు కట్టుకోవడానికి కొందరు ముందుకు వస్తారని అక్కడి నాయకుడొకరు తెలిపారు. నాతవరం మండలం వై.బి.పట్నం సమీపంలోనూ మూడిళ్లు ఉన్న చోట రోడ్డేశారు. నివాసప్రాంతాల్లో రోడ్ల కోసం ప్రజల నుంచి విన్నపాలు వస్తున్నప్పటికీ ఊరవతలి గుడులకు, శ్మశానాలకు వెళ్లేందుకు కొందరు రోడ్లు వేయించారు. నక్కపల్లిలోని టీచర్స్ కాలనీలో ఒకే ఇల్లు ఉన్నా రూ. 9 లక్షలతో రోడ్డు పనులకు అనుమతి ఇచ్చారు. రాజీవ్ నగర్ కాలనీలో పలు వీధులు అధ్వానంగా ఉన్నప్పటికీ వాటిని వదిలేశారు. ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడిలో ప్రైవేటు స్థలానికి రూ. 17 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్డు వేశారు. ఇక్కడ ఇళ్లు తక్కువే ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలంలోని కోమళ్లపూడిలో పనులకు అత్యధికంగా నిధులు వెచ్చిస్తున్నారు. ఖాళీ స్థలాలకు రోడ్డు వేశారు. శ్మశానవాటికకు వెళ్లే దారంటూ పేర్కొంటున్నారు. శివారు ప్రాంతాల్లో పనులు చేపట్టారు. బాలాజీనగర్‌లో 257 ఇళ్లున్నా ఇక్కడ పనులు చేపట్టకపోవడం దారుణం. నియోజకవర్గంలో 384 పనులకు రూ.21 కోట్లు వెచ్చిస్తున్నారు.

పల్లెపండగ తొలివిడతలో దేవరాపల్లిలో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచాయి. వాలాబు గిరిజన పంచాయతీ శివారు కోడాపల్లి-రామన్నపాలెం రోడ్డులో కల్వర్టు పనులు అసంపూర్తిగా నిలిచాయి. పది పంచాయతీల్లో 44 పనులు చేపట్టేందుకు రూ.12.9 కోట్లు కేటాయించారు. దీనిలో రూ.5.42 కోట్ల నిధులు వెచ్చించారు. రూ. 7.57 కోట్ల విలువైన పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పల్లెపండుగ 2.0లో 24 పనులకు రూ.2.45 కోట్లు కేటాయించగా, ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయని మండల ఇంజనీరు అధికారి సుమతి తెలిపారు. పాయకరావుపేట మండల పరిధిలో రూ. 2.26 కోట్లతో 6.38 కి.మీ, 47 పనులు, నక్కపల్లి మండల పరిధిలో రూ.5.39 కోట్లతో 138 పనులు చేపడుతున్నారు. పాయకరావుపేటలో శ్మశాన వాటిక సమీపంలో నిర్మిస్తున్న రోడ్డులో నివాసాలు చాలా తక్కువగా ఉన్నాయి. రాజుగారిబీడు, షీలానగర్, దేవీనగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఇంకా మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు రోడ్డు సహా డ్రైనేజీ నిర్మాణం ప్రతిపాదనల్లో ఉన్నా ఎక్కడా డ్రైనేజీలు నిర్మించడం లేదు.ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఇంకా మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు రోడ్డు సహా డ్రైనేజీ నిర్మాణం ప్రతిపాదనల్లో ఉన్నా ఎక్కడా డ్రైనేజీలు నిర్మించడం లేదు.

# ఏటిగట్టు రోడ్డుపై ఇసుక అధికారులకు పట్టని ప్రజలు ఇబ్బందులు



**కొవ్వూరు:** నియోజకవర్గం కొవ్వూరు నుండి తాళ్లపూడి ఇసుక ర్యాంపు ల నుండి వచ్చే ఇసుక లారీల వలన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా ఇసుక లారీలపై టార్పాలిన్ కట్టకుండానే ఇసుక తరలిస్తున్నారు. అసలే ఏటుగట్టు సింగిల్ రోడ్డుపై సగం పైగా ఇసుక రోడ్లపై పేరుకుపోవడం కారణంగా ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అడపాదడపా ఇసుకను తొలగించిన రెండవ రోజుకి షరా మామూలుగా మారడం పరిపాటిగా మారింది. ఇసుక రోడ్లపై పడకుండా శాశ్వత పరిష్కారం చూపాచాలని ప్రజలు కోరుతున్నారు. అంతే కాకుండా లారీల కు ఇసుక ఓవర్ లోడ్ వేయడం వలన ఇసుక రోడ్లపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీలు అధిక లోడుతో అధికారులకు పట్టుబడితే జరిమానాలతో సరిపెడుతున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపించలేకపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఏదేమైనా సంబంధిత అధికారులు ఇసుక లారీలపై చర్యలు తీసుకుని వాహనదారులకు ఇబ్బందులు తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# జీఎస్టీ పేరుతో దోపిడీ




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నగరంలో కొందరు వ్యాపారులు జీఎస్టీ పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. హోటళ్లు, టిఫిన్‌పార్లర్‌లు, మసాజ్‌సెంటర్లలో ఈ వ్యవహారం రహస్యంగా సాగుతోంది. వీటిలో ఐదు శాతం, మసాజ్‌సెంటర్లలో 18 శాతం జీఎస్టీగ వసూలుచేస్తున్నారు. కానీ చాలామంది ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు చేరకుండా అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ ఎగవేత ఆరోపణలపై ఐటీ శాఖ అధికారులు ఆదివారం పలుహోటళ్లలో సోదాలు నిర్వహించడం ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. నగరంలో అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలతో పాటు పేరొందిన విద్యాసంస్థలున్నాయి. పర్యాటకంగా ప్రాముఖ్యం ఉండడంతో నిత్యం సందర్శకుల తాకిడి ఉంటుంది. దీంతో నగరంలో హోటళ్లు, టిఫిన్‌పార్లర్‌లకు తాకిడి ఎక్కువ. కేంద్ర ప్రభుత్వం 'ఒకేదేశం-ఒకే పన్ను' పేరుతో జీఎస్టీని అమల్లోకి తేవడంతో హోటళ్లు, టిఫిన్‌పార్లర్‌ల వ్యాపారులు జీఎస్టీలో నమోదుచేసుకోవాలన్నది నిబంధన. వ్యాపారం కేటగిరీని బట్టి వినియోగదారుల నుంచి జీఎస్టీ వసూలుచేయాలి. ఈ మేరకు హోటళ్లు, టిఫిన్‌పార్లర్‌లు, కర్రీపాయింట్‌లు ఐదు శాతం జీఎస్టీ వసూలుచేయాలి. బిల్లుతోపాటు కేంద్రం వాటా జీఎస్టీ (సీజీఎస్టీ), రాష్ట్రం వాటా జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వివరాలతో కంప్యూటరైజ్డ్ ప్రింటింగ్ బిల్లును వినియోగదారులకు అందజేయాలి. వ్యాపారుల చేతివాట హోటళ్లు, టిఫిన్‌పార్లర్‌లకు వచ్చే వినియోగదారులకు బిల్లు ఇచ్చే సమయంలో కొందరు వ్యాపారులు జీఎస్టీ పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. వ్యాపారులు అధికారికంగా ఒకటి, అనధికారికంగా మరో ఖాతాను నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. యూపీఐ, కార్డుపేమెంట్‌లు జరిగేటపుడు అధికారికంగా నమోదుచేసుకున్న ఖాతాకు బిల్లు జమ చేస్తుండగా, క్యాష్‌పేమెంట్‌లను అనధికారిక ఖాతాకు జమచేసి, లావాదేవీలు ప్రభుత్వం దృష్టికి వెళ్లనివ్వడం లేదంటున్నారు. ప్రతి రోజూ జరిగే వ్యాపారంలో కనీసం 20 శాతం క్యాష్‌పేమెంట్‌లు ఉండగా, ఆ మొత్తానికి ప్రింటెడ్ బిల్లులు ఇచ్చినా, సాయంత్రానికి డేటాను తమ కంప్యూటర్ల నుంచి డిలీట్ చేయడంతో జీఎస్టీ అధికారుల దృష్టికి వెళ్లడం లేదంటున్నారు. మసాజ్‌పార్లర్లలో కూడా ఇదే తరహా వ్యవహారం సాగుతోందనే ప్రచారం జరుగుతోంది. మసాజ్‌పార్లర్లలో 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తారు. ఈ సెంటర్లకు వెళ్లినవారు ఎక్కువగా నగదు చెల్లిస్తారు. దీనిని ఆసరాగా చేసుకుని నిర్వాహకులు సెంటర్‌కు వచ్చేవారి వివరాలను జీఎస్టీ అధికారులకు చేరకుండా, కంప్యూటర్లలో ఎంటర్‌చేయడం లేదని సమాచారం. నగరంలో సెలబ్రేషన్స్ గ్రూపునకు చెందిన నాలుగు హోటళ్లలో జీఎస్టీ ఎగవేత ఆరోపణలపై ఐటీ అధికారులు ఆదివారం సోదాలు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హోటళ్లు, టిఫిన్‌పార్లర్‌లో సోదాలు చేస్తే వ్యాపారుల దోపిడీ బయటపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

## నేరేడు వలస ఆదివాసి గిరిజన గ్రామస్తులపై భూ వ్యాపారులు జరుపుతున్న అన్యాయాలపై అనంతగిరి తాసిల్దార్ కు ఫిర్యాదు.

**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. భీంపోలు పంచాయితీకి చెందిన నందకోట రెవెన్యూ గ్రామం నేరేడువలస గ్రామంలో పది ఏళ్ల క్రితం గ్రామంలో పాడి సన్యాసి. పాడి గంగులు. అవును గిరిజనుల భూములు 20 ఎకరములు కృష్ణాజిల్లా నుండి వచ్చిన గిరిజన నేతరుడైన కందిమల్ల సత్యనారాయణ చౌదరి కొనుగోలు చేస మరల కొనుగోలు చేసిన భూమి శాలదని అక్రమంగా అన్యాయంగా



నేరేడువలస గ్రామస్తులైన గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూములు కూడ అమాయక గిరిజనులను అమాయకత్వాన్ని ఆసరాగా చూసి గిరినులు సాగు చేసుకుంటున్నాం ప్రభుత్వ భూములు దౌర్జన్యంగా ఆక్రమించి జె సి బి. మిషన్ తెప్పించి భూ సదును చేయించి పామ్ ఆయిల్ మొక్కలు నాటించి మొత్తం భూములు ఆక్రమించుకున్నాడు గిరిజనులు సాగు చేస్తున్న భూములకు కందిమల్ల సత్యనారాయణ చౌదరి కొన్న భూములకు ఎటువంటి సంబంధం లేదు ప్రభుత్వ భూములు అయినప్పటికీ గిరిజనులు ప్రస్తుతం సాగులో ఉన్నామని తమకు ఎటువంటి భూ రికార్డులు ఆధారాలు లేవని ఇది వాస్తవం. కానీ భూ వ్యాపారైన కందిమల్ల సూర్యనారాయణ చౌదరి మాత్రం తమకు ప్రభుత్వ భూములు పట్టాలు మంజూరు చేసి ఉన్నారని మీకు ఈ భూములకు ఎటువంటి సంబంధం లేదని వెంటనే ఈ భూములు విడిచిపెట్టి మీరు ఉంటున్న ఇల్లులు కూడా కాళీసేసి విడిచిపెట్టి వెళ్లిపోవాలని బెదిరిస్తు ఆదేశిస్తున్నాడు ఈ భూములపై నేను తప్ప మీరు ఎవరు ఉండుటకు వీల్లేదని పదే పదే బెదిరిస్తున్నాడని ప్రస్తుతం తమంత దీన స్థితిలో ఉన్నామని అనంతగిరి తాసిల్దార్ వారు తక్షణమే స్పందించి భూ వ్యాపారిపై చర్యలు తీసుకుని నేరేడు వలస గ్రామ గిరిజనులకు న్యాయం చేయాలని గిరిజనులు కోరుతూ సోమవారం ఫిర్యాదు చేశారు.

విశాఖ సమాచారమ్

మంగళవారం 10-3-2026

# ఉపాధి, ఉద్యోగాలే మహిళా సాధికారత..

భారతదేశంలో మహిళా సాధికారత, లింగ సమానత్వం, మహిళల హక్కులు, రాజకీయ భాగస్వామ్యం మరియు విద్య ప్రాధాన్యంపై విశ్లేషణ. మహిళల అభివృద్ధి దేశ అభివృద్ధికి ఎలా దోహదపడుతుందో ఈ వ్యాసంలో తెలుసుకోండి.
ఉపాధి, ఉద్యోగాలే మహిళా సాధికారత..

స్త్రీ సంస్కృతి, మాతృశక్తి, సృజనాత్మకత, నిరంతర త్యాగాల సమాహారం. స్త్రీ సృష్టి, స్థితి, లయలకు కారకురాలైన శక్తి స్వరూపిణి. సృష్టిని సృజించి, పెంచి, పోషించే అద్భుత శక్తులు స్త్రీ స్వరూపంలోనే ఉన్నాయి.. స్త్రీ కుటుంబ వ్యవస్థకు మూలస్తంభంగా ఉంటూ, దేశ సంస్కృతిని కాపాడుతూ భవిష్యత్తు తరాలను అందించేది. కానీ నేడు నాగరికంగా అనేక మార్పులు చేసుకుంటూ వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఇంకా మహిళా అభివృద్ధి పరిపూర్ణం కాదని అందరికీ తెలిసిందే. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో ఆత్మగౌరవాన్ని, ఉనికిని, హక్కులను గుర్తుచేసుకుని గౌరవించుకోవడానికి, మహిళల ప్రేరణకి ఆమోదించబడింది.

అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ..
భారతదేశంలో స్త్రీల ఉద్యోగ అస్తిత్వం ఆర్థిక సాధికారతకు, సామాజిక సమానత్వానికి మూలం. మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం దారిద్ర్య నిర్మూలనకు దోహదపడుతోంది. అయినా స్త్రీలకు లింగ సమానత్వం సాధించడం సవాలుగా మారుతోంది. సాంప్రదాయ వస్త్రధారణ పట్ల పలుమార్లు అవమానీయ సమాజపు దుర్భాషాలకు ఎదుర్కొంటున్నారు. ఇక పురుషాధిక్య రంగాలలో స్త్రీలు ప్రతిభ కనబరుస్తున్నా ప్పటికీ ఇంకా కొన్ని చోట్ల స్త్రీ శక్తి వంచనకు గురవుతూనే ఉంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా స్త్రీల పట్ల సహృదయత, సమానత్వ భావం, గౌరవం దక్కడం లేదు. మహిళా అభివృద్ధి, సాధికారత అనేది ఒక దేశ సామాజిక, ఆర్థిక వృద్ధికి మూలాధారం. విద్య, ఆర్థిక స్వతంత్రత, నిర్ణయాధికారం విద్యావంతులు, ఆధునికత తెలిసిన పట్టణ ప్రాంత మహిళలు మాత్రమే అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు.

తెరవెనుక పితృస్వామ్య ధోరణితో..
స్త్రీల రాజకీయ భాగస్వామ్యం చాలా విస్తృతమైనది. ఇది ఓటు హక్కుకి పరిమితం కాదు. రాజకీయాల్లో లింగ అసమానతలను రూపుమాపడానికి, భారత ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థలలో 33% రిజర్వేషన్లు కల్పించి సామాజిక సమస్యలపై గొంతు విప్పే అవకాశం కల్పించింది. కానీ స్థానిక సంస్థల్లో ఎన్నికైన మహిళా నాయకురాలు కేవలం నామమాత్రంగా సంత కాలకే పరిమితమవుతున్నారు. తెరవెనుక పితృస్వామ్య ధోరణి చెలామణి అవుతుంది. మహిళలకు నిరక్షరాస్యత, సామాజిక ఒత్తిళ్లు, అడ్మినిస్ట్రేటివ్ అవగాహన కొరత, ఇవన్నీ 73వ రాజ్యాంగ సవరణ ఆశయాలను దెబ్బతీస్తూ వస్తున్నాయి. మహిళల నిజమైన సాధికారతను అడ్డుకుంటూ స్థానిక స్వపరిపాలనలో జవాబుదారీతనాన్ని తగ్గిస్తుంది.

నేటికీ చట్టాలు తెలియని వారెందరో..?
ఇక మహిళలపై జరిగే అన్యాయాలపై, కావలసిన మార్పుల కొరకై సావిత్రిబాయి పూలే, రమాబాయి, సరళా దేవి వంటి వారు స్వాతంత్ర్యానికి పూర్వమే అనేక ఉద్యమాలు చేపట్టారు.. బాబా సాహెబ్ అంబేద్కర్ ఒక దేశం పురోగతి మహిళలు సాధించిన పురోగతిని బట్టే కొలుస్తారని ఆనాడే వివరించారు.. ఇక రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమాన హక్కులు, అవకాశాలను సమర్థిస్తుంది. ఆర్టికల్ 15 లింగ వివక్షతను నిషేధిస్తుంది. వరకట్న నిషేధ చట్టం, సమాన వేతనం మొదలైన చట్టాలు మహిళా అభివృద్ధికి దోహదపడుతున్నా, తమ కోసం ఇన్ని చట్టాలు చేయబడ్డాయన్న విషయం కూడా నేటికీ కొంతమంది మహిళలకు తెలియదు..

మహిళలు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి!
నవ నాగరికంలో విద్యయే సర్వాంతర్యామి.. విద్యావంతులైన స్త్రీలు కుటుంబంతో పాటు సమాజాన్ని చైతన్యపరుస్తున్నారు. అందుకే విద్య, అవగాహన, అక్షరాస్యత, శిక్షణ ద్వారా మహిళల స్థితిని పెంచాలి. మహిళలు వీటిని వెతకడానికి ప్రయత్నం చేయడం ప్రధానమైనది. మహిళల సాధికారతకి ఎదురయ్యే వివిధ సామాజిక సమస్యల ద్వారా జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి మహిళలు ఆత్మవిశ్వాసం, సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. అలాగే స్వయం ఉపాధి, వ్యాపారాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడం చాలా ముఖ్యం. మహిళల స్థితిగతులు బాగుపడితేనే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. కాబట్టి మహిళల హక్కులు గుర్తించడం, వారి సమానత్వాన్ని ప్రోత్సహించాలి.

# ఆర్య సిద్ధాంతం కల్పితమే

భారతదేశానికి ఆర్యులు వలస వచ్చారని వారే వేదాలు రాసారని పాశ్చాత్యులు జాతి విభజన కుట్ర భావంతో అసంబద్ధ ఆర్య సిద్ధాంతాన్ని సృష్టించారు. అసలు ఆర్యులు అనేవారే లేరని భారతదేశానికి వారు అసలు రాలేదని ఇది పాశ్చాత్యులు సృష్టించిన అభూతకల్పన అని శాస్త్రీయంగా రుజువులు ఉన్నాయి. ఇరాన్ (పర్షియా)నుంచి ఆర్యులు వచ్చారని కొన్ని కథనాలు కూడా వచ్చాయి. భారతీయ చరిత్రను అనేక రకాలుగా వక్రీకరించారు. మొగలాయిల పాలన,ఆంగ్లేయుల పాలనలో ఈ నాటికీ చరిత్ర పుస్తకాలలో విద్యార్థులు చదువుకుంటున్నారు. వాటికంటే ముందు ఉన్న భారతీయ రాజుల గూర్చి,భారతీయ గ్రంథాల గూర్చి సమగ్రమైన సమాచారం లేదు. లేదా మన భారతీయ రాజులను కించపరిచేలా చరిత్రను వక్రీకరించారు. అందులో భాగమే ఆర్య సిద్ధాంతం.
ఆర్యులు భారతదేశం వలస వచ్చారనే వాదనను సూర్య సిద్ధాంతం ఖండిస్తున్నది. కలియుగం ప్రారంభంలో భూమిమీద కటిక చీకటి ఆవరించి ఉందని ఈ సిద్ధాంతం చెబుతున్నది. అంటే ఏడు గ్రహాలు ఒకే సరళరేఖ ఉన్నాయని అర్థం. అప్పుడు భూమి నుంచి చంద్రుడు,సూర్యుడు కనపడవు. ఈ విషయాన్ని ఖగోళ శాస్త్రజ్ఞులు క్రీస్తు పూర్వం 3102 లో ఏర్పడిందని శాస్త్రీయంగా పేర్కొన్నారు. దీనికి మద్దతుగా భాగవత పురాణం లో ఒక విషయం ఉంది.పరిక్షిత్ మహారాజుకు శుకమహర్షి భాగవతాన్ని ఏడురోజులలో వివరించాడు. ఆ సమయంలో ఆయన సప్త మహర్షులు ఒక్కో నక్షత్రంలో 100 సంవత్సరాలు ఉంటారని,భాగవతం చెప్పే సమయంలో మఖ నక్షత్రంలో ఉన్నారని తెలిపారు. వేదాల ప్రకారం కలియుగం పూర్వాషాడ నక్షత్రంలో ప్రారంభమైంది.అంటే భాగవతం చెప్పిన తరువాత 11 నక్షత్రాల తరువాత కలియుగం వచ్చింది.అంటే 3102+1100=4202 సంవత్సరాల ముందర అని తెలుస్తున్నది. భారతయుద్ధం జరిగి 4200 సంవత్సరాల ముందు అని చరిత్రకారులు చెప్పడం జరిగింది.
మహాభారతంలో సరస్వతి నది అదృశ్యం అంశం ఉంది.దీనిని బట్టి వేదాల్లో సరస్వతీ నది ప్రస్తావన ఉండడంతో అవి మహాభారతం కన్నా పురాతనమైనవని తెలుస్తున్నది.ఇతిహాసాలు 5 వేల ఏళ్ల క్రితమేవని అర్థమవుతున్నది. పై విషయాల ఆధారంగా ఆర్యులు క్రీ.పూ.1200లలో భారత్ వచ్చారనే వాదనకు బలం ఏముంటుంది. వారి వారసులే నేటి ఉత్తర భారత ప్రజలు అనే వాదన కూడా అవాస్తవమని తేలింది.దక్షిణ భారత ప్రజలు ద్రవిడ సంస్కృతి గల స్థానికులనే వాదన కూడా ఉంది.రామాయణ,భారతాలు అభూతకల్పనలని కొన్ని వర్గాలు ప్రచారం చేస్తున్నాయి.కాని నాసా పరిశోధనల మేరకు రామసేతు నిర్మించడం నిజమేనని శాస్త్రీయంగా రుజువు అయింది.అలాగే కురుక్షేత్రంలో మహాభారత యుద్ధం జరిగిందనేది కూడా వాస్తవమని అనేక రుజువులున్నాయి. పాశ్చాత్య పాలనతో మన భారతీయ సంస్కృతి,విలువైన గ్రంథాలు నాశనం అయ్యాయి. ఇప్పటి పాశ్చాత్యులు తామే చేసామని చెప్పుకుంటున్న పరిశోధనలు వేల సంవత్సరాల క్రితం మన రుషులు కనుగొన్నారు. ఆ విషయాలు మన సంస్కృత గ్రంథాలలో నిక్షిప్తమై ఉన్నాయి.అగస్త్య మహర్షి విద్యుత్తు ను కనుగొన్నారని వేదాల్లో ఉన్నాయి.అలాగే రైట్ సోదరులకంటే మందే భారతీయ రుషి భరద్వాజుడు విమానం లాంటి లోహ విహంగం కనుగొన్నారు.శబ్దతరంగాలు ప్రయాణిస్తాయని రెడియో లాంటి పరికరం శాస్త్ర వేత్త జగదీష్ చంద్రబోస్ కనుగొన్నారు. వారు ఆనాడు వాటిని వాణిజ్య అంశంగా చూడలేదు.గెలీలియో కంటే ముందే సంస్కృత మహా భారతంలో పద్యాలు చంద్రుడి వృద్ధి,క్షయాలకు కారణం భూమి చలనమే కారణమని చెప్పాయి. అలాగే ఆనకట్ట,నీటిపారుదల వ్యవస్థలపై భారతంలో అనేక పద్యాలు వివరించాయి.రసాయనిక శాస్త్ర వికాసాన్ని గమనిస్తే ఔషధ విజ్ఞానం ఆనాడే ఉందని తెలుస్తున్నది.మన పురాణాల్లో దైవ సంవత్సరం అంటే 360 సంవత్సరాలని, దైవ దినమందే ఒక మానవ సంవత్సరానికి రూ ఉంది.అలాగే కల్పం అంటే 14 మనువులు, మనువు అంటే 71 చక్రాలు(నాలుగు యుగాలు),బ్రహ్మజీవితకాలం కలిపి100 సంవత్సరాలు అవుతాయి.సగంబ్రహ్మ జీవిత కాలాన్ని పరార్థమంటారు. రెండు పరార్థాలు ఒక నిమిషం. భారతీయ విజ్ఞాన శాస్త్రం అణువు,పరమాణువులును కూడా విభజించించింది.బీజ గణితం, సున్నాలు భారతీయ రుషి భాస్కరాచార్య కనుగొన్నారు.ప్లాస్టిక్ సర్జరీ మొదట ఆయుర్వేద వైద్యులు సుశ్రుతుడు కనుగొన్నారు.నేటి కంప్యూటర్ భాషకు సంస్కృతానికి సారూప్యముంది. ఇలా చెప్పుకుంటూ పోతే భారతీయ విజ్ఞాన శాస్త్రం అత్యంత పురాతనమైనదని, వేదాల్లో నేటి పరిశోధనలన్నీ నిక్షిప్తమై ఉన్నాయని అర్థమవుతున్నది. అలాగే ఆర్య సిద్ధాంతం తప్పుడు ప్రచారమని,పాశ్చాత్యులు కల్పించిన అభూత కల్పన అని తెలుసుకోవాల్సి ఉంది.

**యం.వి.రామారావు,**
**సీనియర్ జర్నలిస్టు**

# వెన్నునొప్పి - నివారణ మార్గాలు:



వెన్నునొప్పి పట్ల అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. వెన్నునొప్పి అనేది అన్ని వయసుల మరియు నేపథ్యాల వారిని ప్రభావితం చేసే ఒక సాధారణ సమస్య. వెన్నునొప్పిని కేవలం అలసటగా భావించ కూడదు మరియు నిర్లక్ష్యం చేయకూడదు.
తేలికపాటి నొప్పి అయినా తీవ్రమైన అసౌకర్యం అయినా, నిరంతర వెన్నునొప్పి చాలా అసౌకర్యంగా ఉంటుంది మరియు మీ దైనందిన జీవితాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది.

వెంటనే వైద్యుడిని ఎప్పుడు సంప్రదించాలి?
ఇంటి నివారణలు మరియు విశ్రాంతి ఉన్నప్పటికీ, మీ వెన్నునొప్పి కొన్ని వారాల కంటే ఎక్కువ కాలం కొనసాగితే, అది మరింత తీవ్రమైన అసౌకర్యానికి సంకేతం. సాధారణ వెన్నునొప్పి విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుంది, కానీ ఈ క్రింది లక్షణాలు ఉంటే మాత్రం ఆలస్యం చేయకూడదు:
తీవ్రత: నొప్పి కొన్ని వారాల కంటే ఎక్కువగా ఉండి, తగ్గకపోవడం.
గాయాలు: ప్రమాదాలు లేదా కింద పడటం వల్ల నొప్పి మొదలవ్వడం.
నరాల సమస్యలు: కాళ్ళలో తిమ్మిర్లు, జలదరింపు లేదా బలహీనతగా అనిపించడం.
నియంత్రణ కోల్పోవడం: మూత్రాశయం లేదా ప్రేగు కదలికలపై నియంత్రణ తప్పడం (ఇది అత్యవసర పరిస్థితి).
ఇతర లక్షణాలు: కారణం లేకుండా బరువు తగ్గడం లేదా జ్వరం రావడం.

వైద్య సహాయం వల్ల కలిగే ప్రయోజనాలు
1. సరైన కారణం తెలుస్తుంది: ఎక్స్-రే
Xray MRI ద్వారా నొప్పికి అసలు కారణం (డిస్క్ సమస్యలా లేదా కండరాల సమస్యలా) తెలుస్తుంది.
2. సరైన చికిత్స: ఫిజియోథెరపీ, మందులు లేదా వ్యాయామాల ద్వారా నొప్పిని తగ్గించే మార్గాలను వైద్యులు సూచిస్తారు.
3. ముందస్తు నివారణ: చిన్న సమస్యగా ఉన్నప్పుడే గుర్తిస్తే, భవిష్యత్తులో శస్త్రచికిత్స వరకు వెళ్లే ప్రమాదం తగ్గుతుంది.

ఇప్పుడు వెన్నునొప్పిని తగ్గించడానికి మరియు వెన్నెముక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజువారీ జీవితంలో పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలు మరియు వ్యాయామాలు తెలుసుకుందాం.

1. సరైన భంగిమ
చాలామందికి కూర్చునే విధానం సరిగ్గా లేకపోవడం వల్లే వెన్నునొప్పి వస్తుంది.
కూర్చునేటప్పుడు: కుర్చీలో వెనుకకు ఆనుకుని, వెన్నుపూస తిన్నగా ఉండేలా చూసుకోండి. పాదాలు నేలకు ఆనించి ఉండాలి.
స్క్రీన్ లెవల్: కంప్యూటర్ లేదా లాప్‌టాప్ ఉపయోగిస్తున్నప్పుడు, అది మీ కళ్ళకు సమాంతరంగా ఉండాలి. తల వంచి చూడటం వల్ల మెడ మరియు పై వెన్నుపై ఒత్తిడి పడుతుంది.
నిలబడేటప్పుడు: ఎక్కువ సేపు నిలబడాల్సి వస్తే, బరువును రెండు కాళ్ళపై సమానంగా వేయండి.

2. వెన్నునొప్పి తగ్గించే వ్యాయామాలు
వెన్ను కండరాలు బలంగా ఉంటే నొప్పి వచ్చే అవకాశం తగ్గుతుంది. ఈ క్రిందివి ప్రయత్నించవచ్చు:
క్యాట్-కౌ స్ట్రెచ్ (ఙఞ-జశీష హ్‌తీవ్‌ఎష్ట్ర): మోకాళ్లపై మరియు చేతులపై నిలబడి, వెన్నును పైకి మరియు కిందకు వంచుతూ చేసే ఈ వ్యాయామం వెన్నెముకకు ఉపశమనాన్ని ఇస్తుంది.
(బ్రిడ్జ్ పోజ్ ): వెల్లకిలా పడుకుని మోకాళ్లను వంచి, నడుమును నెమ్మదిగా పైకి లేపాలి. ఇది కింది వెన్ను కండరాలను బలపరుస్తుంది.
నడక : ప్రతిరోజూ 20-30 నిమిషాల వేగవంతమైన నడక వెన్నెముకకు రక్త ప్రసరణను పెంచి, కండరాలను ఫ్లెక్సిబుల్‌గా ఉంచుతుంది.

3. బరువులు ఎత్తేటప్పుడు జాగ్రత్తలు
నేలపై ఉన్న వస్తువును ఎత్తేటప్పుడు నడుమును వంచకండి. బదులుగా మోకాళ్లను వంచి కుర్చుని, ఆ వస్తువును పట్టుకుని నెమ్మదిగా పైకి లేవండి. దీనివల్ల ఒత్తిడి వెన్నుపూసపై కాకుండా కాళ్ళపై పడుతుంది.

4. నిద్రించే పద్ధతి
చాలా మెత్తటి పరుపుల కంటే, వెన్నుకు సపోర్ట్ ఇచ్చే కొంచెం గట్టి పరుపులు మంచివి.
ఒత్తిడి తగ్గించడానికి మోకాళ్ల కింద చిన్న దిండు పెట్టుకుని పడుకోవడం వల్ల వెన్నెముక సహజమైన ఆకృతిలో ఉంటుంది.

5. జీవనశైలి మార్పులు
బరువు నియంత్రణ: అధిక బరువు వెన్నెముకపై అదనపు భారాన్ని వేస్తుంది.
విరామాలు: ఆఫీసులో గంటల తరబడి కూర్చునేవారు ప్రతి 30-40 నిమిషాలకు ఒకసారి లేచి 2 నిమిషాలు అటు ఇటు నడవాలి.

ముఖ్యంగా ఈ ఆధునిక కాలంలో మీరు ఆఫీసులో లేదా కంప్యూటర్ ముందు ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల వచ్చే వెన్నునొప్పి గురించి తెలుసుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లేదా డెస్క్ జాబ్ చేసేవారికి ఇది ఒక పెద్ద సవాలు. దీనిని అధిగమించడానికి "90-90-90 నియమం" బాగా పనిచేస్తుంది.

మీరు ఆఫీసులో ఉన్నప్పుడు వీటిని పాటించడానికి ప్రయత్నించండి.

1. 90-90-90 రూల్ (సరైన కూర్చునే విధానం)
మీరు కుర్చీలో కూర్చున్నప్పుడు ఈ మూడు కోణాలు ఉండేలా చూసుకోండి:
మొదటి $90^{\circ}$: మీ మోచేతులు టేబుల్‌పై 90 డిగ్రీల కోణంలో ఉండాలి.
రెండవ $90^{\circ}$ మీ నడుము మరియు వెన్ను కుర్చీకి ఆనుకుని 90 డిగ్రీల కోణంలో ఉండాలి.
మూడవ $90^{\circ}$: మీ మోకాళ్లు వంగి, పాదాలు నేలకు సమాంతరంగా 90 డిగ్రీల కోణంలో ఉండాలి.

2. మానిటర్ అమరిక
కంప్యూటర్ స్క్రీన్ నేరుగా మీ కళ్ళకు ఎదురుగా ఉండాలి. స్క్రీన్ మరీ కిందకు ఉంటే మీ మెడ వంగుతుంది, ఇది వెన్నునొప్పికి దారితీస్తుంది.
స్క్రీన్‌కు, మీకు మధ్య కనీసం ఒక చేతి దూరం ఉండాలి.

3. 'మైక్రో బ్రేక్స్'
ప్రతి 30 నిమిషాలకు ఒకసారి ఈ చిన్న పనులు చేయండి:
20-20-20 నియమం: ప్రతి 20 నిమిషాలకు, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడండి. ఇది కళ్ళతో పాటు మెడ ఒత్తిడిని తగ్గిస్తుంది.
లేచి నిలబడండి: ఫోన్ కాల్స్ మాట్లాడుతున్నప్పుడు లేదా నీళ్లు తాగుతున్నప్పుడు లేచి నిలబడటం లేదా చిన్నగా అటు ఇటు నడవడం చేయండి.
4. డెస్క్ దగ్గరే చేయగలిగే చిన్న స్ట్రెచెస్
షోల్డర్ రోల్స్ : భుజాలను నెమ్మదిగా వెనుకకు మరియు ముందుకు తిప్పండి.
సీటెడ్ ట్విస్ట్ : కుర్చీలో కూర్చునే నడుమును ఒక వైపుకు తిప్పి కుర్చీ హ్యాండిల్‌ను పట్టుకోండి. ఇలా రెండు వైపులా చేయండి. ఇది వెన్నుపూసకు ఫ్లెక్సిబిలిటీని ఇస్తుంది.
5. లంబార్ సపోర్ట్
మీ కుర్చీకి నడుము దగ్గర సరైన వంపు లేకపోతే, ఒక చిన్న దిండును లేదా చుట్టిన టవల్‌ను మీ కింది వెన్ను వెనుక పెట్టుకోండి. ఇది వెన్నెముక సహజమైన వంపును కాపాడుతుంది.

నిరంతర వెన్నునొప్పిని విస్మరించడం
వల్ల భవిష్యత్తులో మరిన్ని తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. వెన్నునొప్పి ఉన్నప్పుడు సొంతంగా పెయిన్ కిల్లర్స్ వాడటం కంటే, నిపుణులైన ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించడం ఎల్లప్పుడూ శ్రేయస్కరం. వైద్యుడిని సకాలంలో సంప్రదించడం ద్వారా, మీరు నొప్పి లేని జీవితం వైపు అడుగులు వేయవచ్చు. అంతేకాకుండా
మీకు ఇప్పటికే తీవ్రమైన నొప్పి ఉంటే, ఏదైనా కొత్త వ్యాయామం ప్రారంభించే ముందు ఫిజియోథెరపిస్ట్ లేదా వైద్యుడిని సంప్రదించడం చాలా మంచిది.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# బ్రెయిన్ హెల్త్ కు మేలు చేసే 8 ముఖ్యమైన పోషకాలు..



మన శరీరానికి ముఖ్యమైన అవయవం మెదడు. ఇది చురుకుగా, ఆరోగ్యంగా పనిచేస్తేనే మనం ఏ పనైనా సమర్థవంతంగా చేయగలుగుతాం. ముఖ్యంగా మెదడు ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉండాలంటే, కొన్ని ముఖ్యమైన పోషకాలు తప్పనిసరి. ఈ క్రమంలో, మెదడు ఆరోగ్యానికి ఉపయోగపడే 8 అత్యవసర పోషకాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**మెదడుకు మేలు చేసే 8 ముఖ్యమైన పోషకాలు..**

శరీరంలోని నరాల వ్యవస్థ ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి మానసిక స్థితి మెరుగుదలకు ఈ పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

1. విటమిన్ %బీ12 (Vitamin B12)నాడీ కణాల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల ఉత్పత్తి, జ్ఞాపకశక్తికి కీలకం. దీని లోపం జ్ఞాపకశక్తి తగ్గడానికి దారితీయవచ్చు. మాంసం, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు వంటి వాటిలో బి12 విటమిన్ లభిస్తుంది.

2. ఫోలేట్ / విటమిన్ మెదడు పనితీరుకు, నాడీ కణాల అభివృద్ధికి ముఖ్యం. హోమోసిస్టీన్ స్థాయిలను తగ్గిస్తుంది. ఆకుకూరలు (పాలకూర), చిక్కుళ్ళు, సిట్రస్ పండ్లు విటమిన్ %బీ%9ను అందిస్తాయి.

3. ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు మెదడు కణాల నిర్మాణం, పనితీరుకు కీలకం. వాపును తగ్గించి, అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పు తగ్గిస్తుంది. కొవ్వు చేపలు , వాల్‌నట్‌లు, చియా సీడ్స్, అవిసె గింజల్లో ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి.

4. విటమిన్ 'అభిజ్ఞా పనితీరు మానసిక స్థితి నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. సూర్యరశ్మి, చేపలు, బలవర్థకమైన పాలలో విటమిన్ లభిస్తుంది.

5. విటమిన్ "ఇ" శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. మెదడు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తుంది. గింజలు (బాదం), విత్తనాలు, కూరగాయల నూనెలు తీసుకోవడం ద్వారా విటమిన్ "ఇ" లభిస్తుంది.

6. మెగ్నీషియం నాడీ కణాల మధ్య సంకేతాలు పంపడంలో మరియు మెదడు విశ్రాంతి తీసుకోవడంలో సహాయపడుతుంది.

ఆకుఆకుకూరలు, డార్క్ చాక్లెట్, నట్స్ ద్వారా మెగ్నీషియం లభిస్తుంది.

7. జింక్ నాడీ సంకేతాల ప్రసారం, మెదడు ఎదుగుదల, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. గుమ్మడి గింజలు, చిక్కుళ్ళు, మాంసం వంటి వాటిలో జింక్ ను పొందవచ్చు.

8. కోలిన్ అసిటైల్‌కోలిన్ అనే ముఖ్యమైన న్యూరోట్రాన్స్‌మిటర్‌ను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది, ఇది జ్ఞాపకశక్తి, కండరాల నియంత్రణకు అవసరం. కోలిన్ అసిటైల్‌కోలిన్ ను పొందడానికి గుడ్లు, మాంసం, కూరగాయలు తినాలి.

మెదడు దీర్ఘాయువుకు కేవలం ఆహారం మాత్రమే కాకుండా, ఈ పోషకాలు సమృద్ధిగా ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం చాలా అవసరం. ఈ పోషకాలు లోపిస్తే జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

# సయాటికా నొప్పి పీడిస్తోందా..? కదలికనే ఔషధం అంటున్న వైద్యులు..!



నడుము నుంచి కాలు వరకు లాగేసే తీవ్రమైన సయాటికా నొప్పి వచ్చిందంటే చాలు అస్సలు భరించలేరు. అయితే, ఈ నొప్పిని తగ్గించుకోవడానికి విశ్రాంతి తీసుకోవడం కంటే, కదలికను కొనసాగించడమే అత్యంత ముఖ్యమైన, ప్రభావవంతమైన చికిత్స అని ఫిజియోథెరపిస్టులు, వెన్నెముక నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. శరీరంలోని అతి పొడవైన నరమైన సయాటిక్ నరం పై ఒత్తిడి పడటం వల్ల ఈ నొప్పి వస్తుంది. నొప్పి ఎక్కువైనప్పుడు వెంటనే బెడ్ రెస్ట్ తీసుకోవడం తాత్కాలిక ఉపశమనం ఇవ్వచ్చు, కానీ దీర్ఘకాలంలో ఇది మరింత హానికరం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కదలిక ఎందుకు ముఖ్యం అంటే..?**

సయాటికా నొప్పికి ప్రధాన కారణం కదలిక లేకపోవడమే. నొప్పి ఉంది కదా అని కదలకుండా పడుకుంటే.. అది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కువ రోజులు కదలకుండా ఉంటే, నడుము, వెన్నెముకకు మద్దతు ఇచ్చే కండరాలు బలహీనపడతాయి దీనివల్ల వెన్నెముకపై ఒత్తిడి పడడం వల్ల నొప్పి ఎక్కువవుతుంది.

**నరాలకు పోషణ.**

మనం కదులుతున్నప్పుడు, వెన్నెముకలోని డిస్క్‌లకు రక్త ప్రసరణ, పోషకాలు అందుతాయి. కదలిక లేకపోతే డిస్క్‌ల ఆరోగ్యం దెబ్బతింటుంది, ఇది నరాల కుదింపును మరింత పెంచుతుంది.

సున్నితమైన కదలికలు, వాపును తగ్గించడానికి సహాయపడతాయి. నడవడం వంటి తక్కువ–ప్రభావ వ్యాయామాలు రక్త ప్రసరణను పెంచి, సహజ నొప్పి నివారణ హార్మోన్లైన ఎండార్ఫిన్లను విడుదల చేస్తాయి. సరైన కదలికలు, సాగదీయడం సయాటిక్ నరాన్ని మరింత సులభంగా జారడానికి సహాయపడతాయి, దీనివల్ల నరంపై ఒత్తిడి తగ్గుతుంది.

# మోసాల కట్టడికి ఎయిర్‌టెల్ ఫీచర్




ఎయిర్‌టెల్ తమ వినియోగదారుల రక్షణకు కొత్త ఏఐ ఆధారిత ఫీచర్‌ను పరిచయం చేసింది. లీక్ అయిన వన్‌టైమ్ పాస్‌వర్డ్‌లతో ముడిపడిన బ్యాంకు మోసాల నుంచి కాపాడటం దీని ఉద్దేశం. నేరగాళ్లు ఫోన్‌కాల్ చేస్తున్నప్పుడు త్వరగా రహస్య బ్యాంకింగ్ ఓటీపీలను చెప్పేలా బాధితులను బురిడీ కొట్టించి, మోసాలకు పాల్పడుతుంటారు. వీటిని దృష్టిలో పెట్టుకొనే తాజా ఫీచర్‌ను రూపొందించారు. దీని పేరు ఫ్రాడ్ అలర్ట్. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో నేరుగా బిల్టిన్‌గా ఉండే ఇది ఫోన్ కాల్ మాట్లాడుతున్నప్పుడు అప్పటికప్పుడే రంగంలోకి దిగి, పనిచేస్తుంది.

ఇలా పనిచేస్తుంది


బ్యాంకింగ్ ఓటీపీ మోసాలు రోజురోజుకీ ఎక్కువవుతున్నాయి. మోసగాళ్లు తరచూ డెలివరీ ఏజెంట్లు, సర్వీస్ ప్రొవైడర్లు, బ్యాంకు అధికారులమని చెప్పి కాల్ చేస్తుంటారు. అనవసర భయాన్ని పుట్టించి ఓటీపీలను తెలుసుకోవటానికి ప్రయత్నిస్తుంటారు. అప్పటికే మొదలెట్టిన ఆర్థిక లావాదేవీ కోసం ఓటీపీలను వాడుకుంటుంటారు. ఓటీపీని షేర్ చేయగానే మోసగాళ్లు బ్యాంకు ఖాతాలోకి వెళ్లి, నిమిషాల్లో నిధులు మళ్లించుకుంటారు. కీలక సమయంలో ఈ క్రమాన్ని తమ వ్యవస్థ ఛేదిస్తుందని ఎయిర్‌టెల్ చెబుతోంది. ప్రమాదకరమైన లేదా అనుమానిత ఇన్‌కమింగ్ కాల్స్ వచ్చినప్పుడు, అదే సమయంలో ఓటీపీ డెలివరీ అయినప్పుడు ఏఐ ఆధారిత టూల్ దాన్ని పసిగడుతుంది. వెంటన్ హెచ్చరిక జారీ చేస్తుంది. ఓటీపీని షేర్ చేయటం ప్రమాదకరమని కాల్ మాట్లాడుతున్నప్పుడే చెబుతుంది. దీంతో కాసేపాగి, ఆలోచించుకునే సమయం చిక్కుతుంది. ఇలా మోసం జరగకుండా నిలువరిస్తుంది. ఇలాంటి మోసాలను ఈ టూల్ కచ్చితంగా గుర్తిస్తున్నట్టు పెద్దఎత్తున చేసిన ప్రయోగ పరీక్షల్లో తేలిందని ఎయిర్‌టెల్ పేర్కొంది. ఈ కొత్త ఓటీపీ రక్షణ వ్యవస్థను ఇప్పటికే హరియాణాలో అమల్లోకి తెచ్చారు. మరో రెండు వారాల్లో దేశమంతా విస్తరించాలని భావిస్తున్నారు.

# ఎత్తు పెరిగే రోబో



చైనా పరిశోధకులు ఓ విచిత్రమై హ్యూమనాయిడ్ రోబోను తయారుచేశారు. దీని పేరు గ్రోహెచ్ఆర్. ఇది తన రూపం మార్చుకోగలదు, ఎగరగలదు. నీటిలో ఈదటమే కాదు, నీటి మీద నడవగలదు కూడా. మనుషుల ఎముకల గుణాలను స్ఫూర్తిగా తీసుకొని దీన్ని రూపొందించారు. ఇది తన ఆకారాన్ని 315 శాతం వరకూ పెంచుకుంటుంది. అవసరమైతే ముడుచుకొని, ఇరుకుగా ఉన్న చోట్ల నుంచీ సాగుతుంది. కేవలం 4.5 కిలోల బరువుండే ఇది తన ఎత్తును మూడు రెట్ల వరకూ పెంచుకోగలదు. చక్రాల సాయంతో వేగంగా కదులుతుంది. బలం, దృఢత్వం, మన్నిక సైతం ఎక్కువే. పిల్లలు పెద్దగా అవుతున్నకొద్దీ ఎముకలు పెరుగుతాయి. దృఢంగా ఉండటమే కాకుండా ఏదైనా తాకినా తట్టుకుంటాయి. సూక్ష్మరంధ్రాలతో కూడి ఉండటం వల్ల బరువూ తక్కువే. వీటిని దృష్టిలో పెట్టుకునే కొత్త రోబోను సృష్టించారు. ఎత్తు పెరిగే లింకులను జతచేసి దృఢంగా, సాఫీగా కదిలేలా, పలు రకాల పనులు చేసేలా తీర్చిదిద్దారు. విస్తరించగల మృదువైన గదులు, తీగలు, దృఢమైన అడాప్టర్ల వంటి పరికరాలతో మన్నికగా ఉండేలా తయారుచేశారు. అందువల్ల దృఢంగా ఉండటంతో పాటు అవసరమైనప్పుడు రూపం మార్చుకోవటానికి వీలవుతుంది.

# ఏఐ మీ ఫొటోను చదివేస్తుంది.. మీరుండే చోటును చెప్పేస్తుంది!



ఫేస్‌బుక్‌లోనో, ఎక్స్‌లోనో ఎన్నో ఫొటోలు షేర్ చేస్తుంటారు. వీటితో ఎలాంటి హాని ఉండదని చాలామంది భావిస్తుంటారు. కానీ మోసగాళ్లు వీటి సాయంతో మీరుండే ప్రాంతాన్ని ఇట్టే తెలుసుకోగలరంటే నమ్ముతారా? అంతా ఏఐ టూల్స్ మహిమ. అలాగని ఇవేమీ జీపీఎస్ డేటాను వాడుకోవు. సీలింగ్ టైల్స్, విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్లు, పర్వతాల వంటి పరిసరాలు.. చివరికి ఎండ పడే తీరు వంటి వాటిని విశ్లేషించి ఆయా ప్రాంతాలను గుర్తిస్తాయి. ఇలాంటి టూల్స్‌లో ఒకటి జియోస్పై. దీనికి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఇమేజ్‌లతో శిక్షణ ఇస్తారు. ఇది నిర్మాణ శైలులు, చెట్లు, నేల తీరుతెన్నులు, రోడ్డు ఉపరితలాల వంటి వాటిని చదవగలదు. అధునాతన మోడల్ అయితే మరింత కచ్చితంగా మీ లొకేషన్‌ను గుర్తించగలదు.

ఈ పనిని చాట్‌జీపీటీ కూడా చేయగలదని గత సంవత్సరం తెలుసుకున్నారు. కొన్ని బార్లు, రెస్టరెంట్ల ఫొటోలను దీనిలో అప్‌లోడ్ చేస్తే కేవలం కొద్ది సెకండ్లలోనే ఆ ప్రాంతాలను కచ్చితంగా గుర్తించింది. ఎలాంటి మెటాడేటా అవసరం లేదు. ఒక్క ఫొటో చాలు. శిక్షణ పొందిన నిఘా నిపుణులకు ఏళ్లు పట్టే పనిని ఏఐ టూల్ చిటికెలో చేసేస్తుంది. ప్రతి రోజూ సామాజిక మాధ్యమాల్లో 1,400 కోట్ల ఇమేజెస్ షేర్ అవుతున్నాయి. ప్రతి ఒక్కటీ లొకేషన్‌ను పట్టించగలదు. మరి దీన్నుంచి రక్షించుకోవాలంటే?

కెమెరాలో లొకేషన్ ట్యాగ్‌ను ఆఫ్ చేసుకోవటం ఒక మార్గం. ఐఫోన్‌లో సెటింగ్స్ ద్వారా ప్రైవసీ అండ్ సెక్యూరిటీలోకి వెళ్తే లొకేషన్ సర్వీసెస్ కనిపిస్తుంది. ఇందులో కెమెరా ఫీచర్‌లో నెవర్ ఎంచుకోవాలి. ఆండ్రాయిడ్‌లో కెమెరా యాప్‌లోకి వెళ్లి సెటింగ్స్ ద్వారా లొకేషన్ ట్యాగ్స్‌ను ఆఫ్ చేసుకోవాలి.

సోషల్ మీడియా యాప్స్‌లో లొకేషన్‌ను ఆఫ్ చేసుకోవచ్చు. ఉదాహరణకు– ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రొఫైల్ ∩ మూడు గీతలు ∩ సెటింగ్స్ ∩ స్టోరీ ∩ లైవ్ లొకేషన్ ∩ లొకేషన్ షేరింగ్‌లోకి వెళ్లాలి. లొకేషన్‌ను ఎవరు చూడొచ్చో అనే ఫీచర్‌లో నో వన్ ఎంచుకోవాలి. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి వాటిల్లోనూ ఇలాగే చేయొచ్చు.

ఫొటో తీయటం తెలివిగా: ఫొటో తీసేటప్పుడే కాస్త తెలివిగా ఉండాలి. మీ ఇంటికి దగ్గరగా ఉండే వీధి లైట్లు, ప్రముఖ కట్టడాలు, ల్యాండ్‌మార్క్‌లను ఏఐ ఇట్టే గుర్తిస్తుందని తెలుసుకోవాలి.

ఫొటోలను క్రాప్ చేయటమూ ఒక పద్ధతే. ఎంత ఎక్కువగా క్రాప్ చేస్తే అంత తక్కువగా బ్యాక్‌గ్రౌండ్ ఉండేలా చూసుకోవచ్చు. మీ ఫోన్‌లో బ్యాక్‌గ్రౌండ్‌ను ఆటోమేటిగ్గా బ్లర్ చేసే సదుపాయం ఉంటే ఎనేబుల్ చేసుకోవచ్చు.

## ఫోన్ చదివి వినిపిస్తుంది

వాట్సప్‌లోనో, ఎక్స్‌లోనో పెద్ద కథనం కనిపించిందా? పకోడీ చేస్తుండగా ఎవరో మెసేజ్ పంపించారా? లేదూ కళ్లు అలసిపోయి, మూతలు పడుతున్నాయా? ఇలాంటి పరిస్థితుల్లోనే ఎవరైనా చదివి వినిపిస్తే బాగుంటుందని అనిపిస్తుంటుంది. ఎవరో ఎందుకు? మీ ఫోనే ఆ పని చేసి పెడుతుంది. ఐఫోన్‌లో– సెటింగ్స్ ద్వారా యాక్సెసబిలిటీలోకి వెళ్తే స్పోకెన్ కంటెంట్ ఫీచర్ కనిపిస్తుంది. ఇందులో స్పీక్ స్క్రీన్ బటన్‌ను ఆన్ చేసుకుంటే సరి. ఆ తర్వాత తెర మీది నుంచి కిందికి రెండు వేళ్లతో స్వైప్ చేస్తే చాలు. తెర మీద ఉన్నదాన్ని ఫోన్ బిగ్గరగా చదివి చెబుతుంది. ఆండ్రాయిడ్‌లో– సెటింగ్స్ ద్వారా యాక్సెసబిలిటీలోకి (కొన్ని ఫోన్లలో ఇది అడిషన్ సెటింగ్స్‌లో ఉంటుంది) వెళ్లి, సెలెక్ట్ టు స్పీక్‌ను ఎనేబుల్ చేసుకోవాలి. దీంతో తెర మీద ఉండే టెక్స్ట్ లేదా ఇమేజ్ మీద తేలుతున్న బటన్ కనిపిస్తుంది. దీన్ని ట్యాప్ చేస్తే మొత్తమంతా చదివి వినిపిస్తుంది.

## చిటికెలో ఇన్‌కాగ్నిటోలోకి

వెబ్ బ్రౌజింగ్ హిస్టరీలో నమోదు కాకుండా, ఇతరులకు తెలియకుండా ఉండటానికి ఇన్‌కాగ్నిటో మోడ్‌ను చాలామంది వాడుతూనే ఉంటారు. దీన్ని డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లో చిటికెలో ఎనేబుల్ చేసుకునే చిట్కా ఉంది. క్రోమ్, ఎడ్జ్, సఫారీలో కంట్రోల్, షిఫ్ట్, ఎన్ (మ్యాక్‌లో కమాండ్, షిఫ్ట్, ఎన్) మీటలను కలిపి నొక్కితే సరి. ఫైర్‌ఫాక్స్‌లోనైతే కంట్రోల్, షిఫ్ట్, పీ (మ్యాక్‌లో కమాండ్, షిఫ్ట్, పీ) కలిపి నొక్కాలి. హిస్టరీలో నమోదు కాదు. కుకీస్, ట్రేస్ బెడద ఉండదు. పని పూర్తయ్యాక ఆల్ట్, ఎఫ్4 (మ్యాక్‌లో కమాండ్, షిఫ్ట్, డబ్ల్యూ) కలిపి నొక్కితే వెంటనే తిరిగి మామూలు మోడ్‌లోకి వచ్చేస్తుంది. ఇన్‌కాగ్నిటో జరిగింది ఇన్‌కాగ్నిటోలోనే ఉండిపోతుంది.

## మార్కెట్లోకి ఐకూ 15ఆర్ మొబైల్

బెంగళూరు: గేమింగ్ ప్రేమికులు అమితంగా ఇష్టపడే ఐకూ బ్రాండ్ మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను అధికారికంగా భారతీయ విపణిలో అడుగుపెట్టింది. సంస్థ ఇండియా సీఈఓ నిపుణ్ మార్య మంగళవారం బెంగళూరులో ఈ కొత్త మొబైల్‌ను ఆవిష్కరించారు. స్నాప్‌డ్రాగన్ 8జన్ 5 ప్రాసెసర్, 7,600 ఎంఏహెచ్ బ్యాటరీతో తయారైన ఐకూ 15ఆర్ మొబైల్‌లో ఆధునిక ఫీచర్లున్నాయి. ఐకూ సిరీస్‌లోని 15ఆర్ ఆండ్రాయిడ్ 16 ఆరిజన్ ఓఎస్6తో పనిచేస్తుండగా ఈ ఫీచర్‌ను నాలుగేళ్లపాటు ఆండ్రాయిడ్ అప్‌డేట్, ఆరేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇచ్చినట్లు నిపుణ్ తెలిపారు. 6.59 అంగుళాల 1.6కే డిస్‌ప్లే, 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్, 5వేల నిట్స్ పీక్ వెలుతురు ఫీచర్ ఉంది. ఈ మొబైల్‌కు హెచ్‌డీఆర్ 10 సర్టిఫికేషన్ ఉంది. 700వీ మెయిన్ కెమెరా, 50 ఎంపీ సోనీఎల్‌వైటీ బ్యాక్, ఆప్టికల్ ఇమేజ్, 8ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఫీచర్‌తో ఉన్న ఈ మొబైల్ 8జీబీ, 256జీబీ వేరియంట్ రూ.44,999కాగా, 12జీబీ, 256జీబీ వేరియంట్ రూ.47,999, 12జీబీ, 512జీబీ వేరియంట్ ధర రూ.52,999గా నిర్ణయించినా ప్రారంభ ఆఫర్లతో పాటు వివిధ బ్యాంకుల క్రెడిట్ కార్డు ఆఫర్లు కూడా వర్తిస్తాయని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

# ఉల్లిపాయ రసం రెగ్యులర్ గా తాగడం వల్ల కలిగే లాభాలు మీకు తెలుసా..?





మనం నిత్యం వంటల్లో ఉపయోగించే వాటిల్లో ఉల్లిపాయ ముఖ్యమైనది. వంటకాన్ని రుచిగా మార్చడంలోనే కాకుండా, అనేక ఆరోగ్యకరమైన పోషకాలు కలిగి ఉంది. రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి రక్తంలో చక్కెరను నియంత్రించడం వరకు, ఉల్లిపాయలు అనేక విధాలుగా సహాయపడతాయి. కాబట్టి రోజూ ఉల్లిపాయ రసం తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

ఉల్లిపాయలో విటమిన్ "సి" , "బి" వంటి విటమిన్లు, పొటాషియం,మాంగనీస్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. కాబట్టి ఉల్లిపాయ రసం తాగడం వల్ల ఈ పోషకాలు అందుతాయి. విటమిన్ "సి" ఉన్న ఉల్లిపాయ రసం తాగడం కూడా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడటానికి సహాయపడుతాయి. అంతేకాదు కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి కూడా. ఉల్లిలో ఉండే సల్ఫర్, ఇతర యాంటీఆక్సిడెంట్లు కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**రక్తం గడ్డకట్టడాన్ని నివారించడం..**

ఉల్లిపాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, సల్ఫర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. రక్తపోటును తగ్గించడం, రక్తం గడ్డకట్టడాన్ని నివారించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఉల్లిపాయలలో ఉండే కొన్ని సమ్మేళనాలు యాంటీ డయాబెటిక్ ప్రభావాలను కలిగి ఉన్నాయని అధ్యయనాలు కనుగొన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఉపయోగపడుతాయి. అంతే కాదు, ఉల్లిపాయలు ఫైబర్ కంటెంట్ కు గొప్ప మూలం. ఇది జీర్ణక్రియకు సహాయపడడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

# ఏఐ ఆఆఇఈ




ప్రపంచమంతా కృత్రిమ మేధ (ఏఐ) కోసం పోటీ పడుతోంది. ఎన్నెన్నో వినూత్న టూల్స్ వెలుగు చూస్తున్నాయి. ఇవి అత్యున్నత పరిశోధనలకే పరిమితం కావటం లేదు. దైనందిన జీవితంలో భాగంగానూ మారుతున్నాయి. చాట్‌జీపీటీ, జెమినై, పర్‌ప్లెక్సిటీ, క్లాడ్ వంటి ఏఐ బాట్లు చదువులకు సహకరించటం దగ్గరి నుంచి సూచనలు, సలహాలు ఇవ్వటం వరకూ ఎన్నెన్నో పనులు చేసిపెడుతున్నాయి. బాధ్యతాయుత, నైతిక ఏఐని ప్రోత్సహించటం, ప్రపంచ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయటం, ఆర్థిక ప్రాధాన్య రంగాల్లో ఏఐ వాడకాన్ని పెంపొదించే ఉద్దేశంతో ఇప్పుడు దిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026 కూడా నడుస్తోంది. అయితే ఇంత విస్తృతంగా సంచలనం సృష్టిస్తున్నప్పటికీ చాలామందికి ఇంకా ఏఐ ఓనమాలు సరిగా తెలియవు. దీనికి పునాదిగా నిలుస్తున్న పదజాలం అర్థమే కావటం లేదు. అందుకే దీనిపై ఓ కన్నేద్దాం.

ఆల్గారిథం

సమస్యను పరిష్కరించటానికి లేదా కంప్యుటేషన్ నిర్వహించటానికి తోడ్పడే ప్రక్రియ. హార్డ్‌వేర్‌లో గానీ సాఫ్ట్‌వేర్‌లో గానీ అంచెలంచెలుగా ఆయా పనులు చేయటానికి ఆల్గారిథమ్స్ కచ్చితమైన సూచనల జాబితాగా పనిచేస్తాయి. ఇవి సాధారణంగా ప్రత్యేకమైన గణనను వర్ణించే ఇన్‌పుట్, సూచనలతో పని మొదలెడతాయి. గణన పూర్తయ్యాక అవుట్‌పుట్‌ను అందిస్తాయి. సమాచార, సాంకేతిక రంగంలోని అన్ని విభాగాల్లోనూ వీటిని విస్తృతంగా వాడుకుంటున్నారు. ఆటోమేటెడ్ వ్యవస్థల్లోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. సోషల్ మీడియా యాప్స్‌లో యూజర్ రికమండేషన్ వంటి మరింత సంక్లిష్టమైన పనులకు లేదా అంకెల సముదాయాలను విభజించటానికి ఆల్గారిథమ్‌లు దోహదం చేస్తాయి.

న్యూరల్ నెట్‌వర్క్

మనిషి మెదడులాగా నిర్ణయాలు తీసుకోవటం దీని ప్రత్యేకత. మన మెదడులోని నాడీ కణాలను అనుకరిస్తూ ఆయా దృగ్విషయాలను గుర్తిస్తుంది. అంశాలను బేరీజు వేసుకొని, నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రతి న్యూరల్ నెట్‌వర్క్‌లోనూ నోడ్స్ (కృత్రిమ నాడీ కణాలు) పొరలుంటాయి. ఒక ఇన్‌పుట్ పొర (ఒకటి లేదా ఎక్కువ అదృశ్య పొరలు), ఒక అవుట్‌పుట్ పొర ఉంటాయి. ప్రతీ నోడ్ మరో దాంతో అనుసంధానమవుతుంది. ఒక నోడ్ అవుట్‌పుట్ పరిమితి మించితే తర్వాతి పొరకు డేటా అందుతుంది. శిక్షణకు ఉపయోగించే డేటా మీదే న్యూరల్ నెట్‌వర్క్లు ఆధారపడతాయి. దీంతోనే క్రమంగా కచ్చితత్వాన్ని మెరుగుపరచుకుంటాయి. అత్యంత వేగంగా సమాచారాన్ని వర్గీకరించటం, క్రోడీకరించటానికి తోడ్పడతాయి. మనుషులతో పోలిస్తే చాలా త్వరగా స్పీచ్, ఇమేజ్‌లను గుర్తిస్తాయి. న్యూరల్ నెట్‌వర్క్లను కొన్నిసార్లు ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్లు (ఏఎన్ఎన్స్) అనీ పిలుచుకుంటారు. డీప్ లెర్నింగ్ మోడళ్లకు ఇదే గుండెకాయ.

లార్జ్ లాంగ్వేజ్ మోడల్

జనరేటివ్ ఏఐ మోడళ్లు మనతో 'సంభాషిస్తున్నాయి' అంటే ఎల్ఎల్ఎం మూలంగానే. అవి తర్వాత వచ్చే పదాన్ని లేదా వాక్యాన్ని అంచనా వేయటం దీని చలవే. ఒక్కమాటలో చెప్పాలంటే– దీన్ని చాట్‌బాట్ల వంటి వాటిల్లో ఉండే జనరేటివ్ ఏఐకి గుండెకాయ అనొచ్చు. ఇది భారీ భాషా సూత్రాల సముదాయం. ఆయా పనులు నిర్వర్తించేలా దీనికి ముందుగా శిక్షణ ఇవ్వచ్చు. అనంతరం మెరుగుపరచొచ్చు కూడా. టెక్స్ట్‌ను వర్గీకరించటం, ప్రశ్నకు సమాధానం ఇవ్వటమే కాదు.. టెక్స్ట్‌ను సృష్టించటం, డాక్యుమెంట్ల సారాంశాన్ని గుదిగుచ్చి అందించటం వంటి ఎన్నో పనులకు ఉపయోగపడుతుంది. ఎల్ఎల్ఎంను ప్రధానంగా మూడు భాగాలుగా విభజించొచ్చు. ఒకటి లార్జ్. పేరుకు తగ్గట్టుగానే దీనికి పెద్దమొత్తం డేటాతో శిక్షణ ఇస్తారు. రెండు హైపర్ పారామీటర్స్ సంఖ్య. ఇది మెషిన్ లెర్నింగ్‌కు తోడ్పడే సాధనం. మోడళ్లతో మెషిన్‌కు శిక్షణ ఇచ్చేటప్పుడు ఆయా అంశాలను నేర్చుకోవటానికి, గుర్తుంచు కోవటానికి ఈ హైపర్‌పారామీటర్స్ తప్పనిసరి. ఎల్ఎల్ఎంలో మరో ముఖ్యమైన విషయం వివిధ అవసరాలకు ఉపయోగపడటం (జనరల్ పర్పస్). అంటే తరచూ ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే సామర్థ్యం కలిగుండటం. ఇది నిర్దేశిత పనులు, పరిమిత వనరులతో సంబంధం లేకుండా మనుషులు మాట్లాడే, అర్థం చేసుకునే భాషా సారూప్యతతో పనిచేస్తుంది. మొత్తమ్మీద ఎల్ఎల్ఎం సూపర్ కంప్యూటర్ ప్రోగ్రామ్ వంటిదని అనుకోవచ్చు. కంప్యూటర్లకు మనుషులు మాట్లాడే మాటలను అర్థం చేసుకునేలానే కాకుండా, మాటలను సృష్టించే సామర్థ్యాలనూ కట్టబెట్టటం దీని ప్రత్యేకత.

మెషిన్ లెర్నింగ్

కంప్యూటర్ వ్యవస్థలు మనుషులు నేర్చుకునే తీరును అనుకరిస్తున్నాయంటే అంతా మెషిన్ లెర్నింగ్ చలవే. మనుషులు ఎలాంటి సూచనలు ఇవ్వకపోయినా కృత్రిమ మేధ తనంత తాను పనిచేయటానికిది తోడ్పడుతుంది.

డేటా సాయంతో కంప్యూటర్లకు శిక్షణ ఇవ్వటం దీనిలోని కీలకాంశం. అంక గణితం, సాంఖ్యక శాస్త్రం, తప్పులసవరణను మేళవించటం ద్వారా మెషిన్ లెర్నింగ్ వ్యవస్థలు భారీ డేటా సముదాయాల్లో సంబంధాలను, తీరుతెన్నులను గుర్తిస్తాయి. కొత్త సమాచారం మీద ఒక నిర్ణయానికి వస్తాయి. వీటికి ఎంత ఎక్కువ డేటాను అందిస్తే అంత ఎక్కువగా తర్ఫీదు పొందుతాయి. కొత్త లక్ష్యాలను పూర్తి చేయటాన్ని మరింతగా నేర్చుకుంటాయి. అదీ తమంత తాముగానే.

డీప్ లెర్నింగ్

మెషిన్ లెర్నింగ్‌లో ఒక భాగమైన ఇది వివిధ పొరలతో కూడిన డీప్ న్యూరల్ నెట్‌వర్క్ల సాయంతో పనిచేస్తుంది. మనిషి మెదడు మాదిరిగా సంక్లిష్టమైన నిర్ణయాలను సిమ్యులేట్ చేస్తుంది. మెషిన్ లెర్నింగ్‌కూ డీప్ లెర్నింగ్‌కూ మధ్య ముఖ్యమైన తేడా న్యూరల్ నెట్‌వర్క్ నిర్మాణమే. సంప్రదాయ మెషిన్ లెర్నింగ్ మోడళ్లు ఒకట్రెండు కంప్యుటేషనల్ పొరలతో కూడిన మామూలు న్యూరల్ నెట్‌వర్క్లను వాడుకుంటాయి. అదే డీప్ లెర్నింగ్ మూడు, అంతకన్నా ఎక్కువ పొరలను.. ఆ మాటకొస్తే వందలాది, వేలాది పొరలతో మోడళ్లకు శిక్షణ ఇస్తుంది. దీనికి బయటి నుంచి పర్యవేక్షణ అవసరం లేదు. ముడి, గజిబిజి డేటా నుంచి స్వభావాలను, లక్షణాలను, సంబంధాలను వెలికి తీసి కచ్చితమైన అవుట్‌పుట్ అందిస్తుంది. అవుట్‌పుట్‌ను విశ్లేషించుకొని, మెరుగుపరచుకుంటుంది కూడా. డిజిటల్ అసిస్టెంట్లు, వాయిస్ ఎనేబుల్డ్ టీవీ రిమోట్లు, స్వయంచాలిత వాహనాలు, జనరేటివ్ ఏఐ వంటి వాటికిది ఎంతగానో ఉపయోగపడుతోంది.

# గోదావరి జిల్లాల సమాచారం

## గ్యాస్‌కు గడువు.. ధర దరువు



**అల్లవరం :** గల్ఫ్‌లో యుద్ధం నేపథ్యంలో భవిష్యత్తులో కొరత ఏర్పడుతుందనే భయంతో వంట గ్యాస్ బుకింగ్స్ పెరుగుతుండటంతో ఆయిల్ కంపెనీలు, ప్రభుత్వం అప్రమత్తమయ్యాయి. వంట గ్యాస్ బుకింగ్‌పై కొత్త విధానం అమల్లోకి తీసుకువచ్చారు. సింగిల్ సిలెండర్ ఉన్న వారికి 21 రోజుల తర్వాత, రెండు ఉన్నవారు 30 రోజుల తర్వాత మాత్రమే బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ మేరకు చమురు సంస్థలు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశాయి. మరోవైపు వంట గ్యాస్ ధరకు రెక్కలు వచ్చాయి. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్ ధర రూ.885 ఉండేది. ప్రస్తుతం రూ.941.50కు చేరింది. ఒక్కసారిగా రూ.56 పెరిగింది. సరఫరా సైతం ఆలస్యమవుతోందని వినియోగదారులు చెబుతున్నారు.

**నిలిచిన వాణిజ్య సిలెండర్లు..**

జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర దుకాణాల్లో వంటలకు వాణిజ్య సిలెండర్లు వినియోగిస్తారు. తాత్కాలికంగా వీటి పంపిణీ నిలిపి వేసినట్లు పౌర సరఫరాల సంస్థ అధికారులు తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో సుమారు.. 150 వరకు పెద్దవి, 300 వరకు మధ్యస్త హోటళ్లు, వందల సంఖ్యలో టీ పాయింట్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో నెలకు 10వేల నుంచి 15 వేల వరకు వాణిజ్య సిలిండర్లు వినియోగిస్తున్నారు. 21 రోజుల నిబంధనల అమలులోకి వచ్చిందని డీఎస్‌వో భాస్కర్ తెలిపారు. వినియోగదారులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.

## 15 నుంచి రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

**నల్లజర్ల:** మాస్టర్స్ చెస్ అకాడమీ, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి రాష్ట్ర స్థాయి ఓపెన్ రాపిడ్ చదరంగం పోటీలు జరుగుతాయని టోర్నమెంట్ కమిటీ కన్వీనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం నల్లజర్లలోని కింగ్స్ ఉడ్ స్కూల్‌లో పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ఆవిష్కరించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 300 మంది చెస్ క్రీడాకారులు హాజరవుతారన్నారు. పాల్గొనే క్రీడాకారులు ఏపీచెస్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94408 67370, 89787 82501 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కింగ్స్ ఉడ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ దాపర్తి శివ, సెక్రటరీ, కరస్పాండెంట్ నిఖిలదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ సాయికుమార్, సొసైటీ అధ్యక్షులు రావూరి వెంకటరమణ, మార్ని దుర్గారావు, సవలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక లారీల సీజ్

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను అధికారులు సీజ్ చేశారు. రూ.1.70 లక్షల జరిమానా విధించారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ కథనం ప్రకారం.. రాజానగరం హైవే పరిధి, లాలాచెరువు సమీపంలో పరిమితికి మించి ఇసుక లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలను రవాణా అధికారులు పట్టుకున్నారు. సీజ్ చేసిన వాహనాలను అపరాధ రుసుము చెల్లించిన తర్వాత విడుదల చేశామన్నారు. పరిమితికి మించి ఇసుక రవాణా చేయడం వల్ల రహదారులపై ఇసుక పడి ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయన్నారు. ఇసుక రవాణా చేసే వాహన యజమానులు, డ్రైవర్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

## సుదీర్ఘ పరిశోధనకు పట్టం

**(రాజమహేంద్రవరం):** అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఏం చేయాలో తెలియదు. ఆ నొప్పిని నివారించేందుకు ఆ సమయంలో బీపీ తగ్గిపోవాలి. అది వెంటనే జరగాలి. అలా జరగాలంటే దానికి సంబంధించిన మందు వెంటనే నోటిలో బుగ్గకు పెడితే సెకన్లలో ఆ మందు లోపలకు వెళ్లి బీపీ అదుపులోకి వస్తుంది. అటువంటి మందుపై పరిశోధనలు చేసి విజయం సాధించారు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డి.నాగమణి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా వర్తనాపల్లి గ్రామానికి చెందిన నాగమణి సాధారణ ఏపీ రెసిడెన్షియల్ స్కూలు, చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నారు. ఆమె ప్రతిభకు ఔషధ నియంత్రణ శాఖలో ఉద్యోగం వచ్చింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పలు జిల్లాల్లో పని చేసి, అంచెలంచెలుగా ఏడీగా ఎదిగారు. నిరంతరం తీవ్ర ఒత్తిడితో కూడిన ఉద్యోగం చేస్తూనే పరిశోధనలపై వైపు దృష్టి సారించారు. 2016లో తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్‌గా చేరారు. 'డిజైన్, ఫ్యాబ్రికేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ బల్క్ డ్రగ్స్ డెలివరీ సిస్టమ్ ఆఫ్ సెలక్టెడ్ డ్రగ్స్' అనే అంశంపై యూనివర్సిటీ ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ వై.ఇందిరా ముజీజ్ నేతృత్వంలో పరిశోధనలు చేశారు. పరిశోధనల అనంతరం తాను తయారు చేసిన మందును ముందుగా కుందేళ్లపై ప్రయోగించి, పరీక్షించారు. ఆ పరీక్షలు విజయవంతమయ్యారు . జనవరి 24న యూనివర్సిటీ కమిటీ సమావేశం నిర్వహించి, ఆమె పరిశోధనలను పరిశీలించి, ఫార్మసీ పీహెచ్‌డీ ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు నాగమణికి యూనివర్సిటీలో శనివారం పీహెచ్‌డీ ప్రదానం చేశారు. నాగమణి తూర్పు గోదావరితో పాటు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో చేసిన సేవలకు గాను బెస్ట్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్, బెస్ట్ డ్రగ్స్ ఏడీగా పలుమార్లు అవార్డులు అందుకున్నారు.

## చైర్మన్ బినామీ భూ వ్యాపారులతో బెంబేలెత్తుతున్న గిరిజనులు

**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. నాన్ షెడ్యూల్ ఏరియా పంచాయితీయులైన ఎన్ ఆర్ పురం. రొంపల్లి. గరుగుబిల్లి. గుమ్మ కోట.భీంపోలు. పంచాయతీలలో జరుగుతున్న భూదందాలు అంతా ఇంతా కాదు అమాయక గిరిజనుల నోట్లో మట్టి కొడుతున్న దళారి మధ్య వార్తలు నిరక్షరాశులయిన అమాయక గిరిజనుల గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక శతమాతం పడి వెళ్ళిపోతున్నారు వీరి గోడు ఎవరు వింటారు వీరికి ఎవరు న్యాయం చేస్తారు మధ్యవర్తుల చేతుల్లో నలిగిపోతున్నారు మండలంలో కొంతమంది పత్రిక వాళ్ళమని రాజకీయ అండ ఉన్న వాళ్ళమని చెప్పుకుంటూ అమాయక గిరి ప్రజలకు మాయమాటలు చెప్పి వారిని బెద్ర గొట్టి రియల్ ఎస్టేట్ భూ వ్యాపారులతో చేతులు కలిపి రైతులకు అందవలసిన డబ్బులు మధ్యవర్తులుగా ఉంటున్న కొంతమంది చోటా నాయకులు వారి జేబుల్లో నింపుకుంటున్నారు తీరా చూస్తే భూ వ్యాపారులు భూ రైతుల దగ్గరకు వచ్చి ఈ భూములు మావి అని చెప్తూ భూమి వద్దకు వస్తే ఆ భూమి యజమానులు ఆ భూములు మావి అని అడగ్గా అదేంటి ఈ భూమిపై డబ్బులు



ఇచ్చామని చెప్తున్నారు కానీ వాస్తవానికి నిజమైన రైతుకు డబ్బులు ముట్టటం లేదు ఇది అనంతగిరి మండలం లో ఉన్న ఈ ఐదు పంచాయతీల్లో జరుగుతున్న బాగోతం అమాయకులైన గిరిజనులు మోసపోతున్నారు అటు భూ వ్యాపారుల మధ్య ఇటు బుధందా మధ్యవర్తులైన చోట నాయకుల మధ్య మోస పోతున్నారు ఈ ఐదు పంచాయతీలలో ఉన్న గిరిజనులు ఆలోచించండి ఇటువంటి తోట నాయకుల చేతుల్లో పడి బలి అవ్వకండి తస్మాత్ జాగ్రత్త ఇప్పటికైనా మేలుకోండి ఎంతకాలం ఈ మోసాలు ఈ అక్రమాలు అన్యాయాలు ఇప్పటికైనా మేల్కోండి

## సామాజిక రుగ్మతల నిర్మూలనే లక్ష్యం



**రాజమహేంద్రవరం :** సమాజంలోని రుగ్మతలను మహిళా చైతన్యంతోనే తరిమికొట్టగలమని.. ఆ ప్రక్రియకు స్వయం సహాయక సంఘాల సభ్యులతో శ్రీకారం చుడుతున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భధారణ (టీనేజీ ప్రెగ్నెన్సీ)ను కట్టడి చేయాల్సిన అవసరముందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల అభ్యున్నతికి కార్యాచరణ ప్రణాళిక 'ఈనాడు'కు వివరించారు.

**పిల్లలకు సమయం కేటాయించాలి**

చాలా ఇళ్లల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించకపోవడం వల్ల అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాలు ఇతర కారణాల వల్ల ప్రేమ పేరిట మోసపోవడం, ఆ క్రమంలో పెళ్లిళ్లు చేయడం జరుగుతోంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొందరు ముందుగానే చేస్తున్న దాఖలాలు ఉన్నాయి.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం: పౌష్టికాహార లోపం, రక్తహీనత బాధితులకు ఔషధాలతోపాటు ప్రకృతి సేద్యంతో పండించిన ఉత్పతులను అంగన్‌వాడీ కేంద్రాలకు కిట్‌లుగా ఇవ్వాలని నిర్ణయించాం. ఈ విధానంలో సాగు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. గోకవరంలో ఓ మహిళ అయిదేళ్ల కిందట సాగు ప్రారంభించి తొలి రెండేళ్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా.. ఆ తరువాతి నుంచి ఆదాయం పొందుతున్నారు. ఈ విధానాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టాలని నిర్ణయించాం.

**విస్తృత చర్చ అవసరం**

సామాజిక రుగ్మతలపై గ్రామస్థాయిలో విస్తృత చర్చ అవసరం. బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీల నివారణకు మహిళలను చైతన్యవంతం చేస్తాం. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే జిల్లా సమాఖ్య సమావేశానికి వెళ్లి అవగాహన కల్పిస్తాం.

**ప్రతి ఆదివారం సదస్సులు**

బాలికా విద్య, ఆరోగ్యం, భద్రత, రక్షణ, భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై వైద్యులు, పోలీసులు, ఇతర శాఖల సిబ్బందితో రాజమహేంద్రవరం నగరంలోని వసతి గృహాల్లో ప్రతి ఆదివారం సదస్సులు నిర్వహిస్తున్నాం. వీటిని కళాశాలల్లోనూ నిర్వహిస్తాం.

**సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా..**

జిల్లాలోని అనేక ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు అవకాశమున్నా సీ-సెక్షన్ (సిజేరియన్)కు వెళ్తున్నారు. సీ-సెక్షన్ ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. సాధారణ ప్రసవాలు జరగాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, వ్యాయామం తదితర అంశాలపై స్వయంశక్తి సంఘాల మహిళలతో గ్రామాల్లోనూ అవగాహన కల్పిస్తాం.

## మహిళా సాధికారతకు ప్రాధాన్యం



**అల్లవరం :** మహిళా సాధికారతకు ప్రాధాసవాళ్లను ఢీకొట్టి.. గెలుపు కిరీటం వైపు పరుగు పెడుతున్న ధీర వనితలకు బాసటగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా అనేక రకాల ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు, ఉపాధి కల్పనే ధ్యేయంగా పలు రకాల పథకాలు, రుణాల మంజూరు కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ముందుకు వస్తే సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**ఆర్థిక సాధికారతే ధ్యేయంగా..**

మహిళల అర్థికాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పలు పథకాలు అమలు చేస్తోంది. 38 స్వయం సహాయ సంఘాల్లో సభ్యులకు 2025-26లో రూ.1400 కోట్ల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేశారు. వీటి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పరుచుకునేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. స్త్రీనిధి ద్వారా రూ.276 కోట్లు, ఎంఎస్ఎంఈ పథకంలో పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో 5,031 మందికి రూ.50.31 కోట్లు రాయితీ రుణాలు అందించారు.

**ఆహార శుద్ధి పరిశ్రమలకు..**

జిల్లాలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారికి ఈ పథకం కింద 35 శాతం వరకు రాయితీ అందిస్తారు. పరిశ్రమను బట్టి రూ.10లక్షల వరకు రుణాన్ని అందిస్తారు. యూనిట్ ఏర్పాటు చేయాలనుకునే వారు కేవలం పెట్టుబడిలో 10 శాతంతో ముందుకు వస్తే మిగిలిన 90 శాతం రాయితీతో రుణం అందిస్తారు.

**వేధింపుల నిరోధానికి..**

మహిళలకు ఇంటా, బయటా ఎదురవుతున్న వేధింపుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం వన్‌స్టాప్ కేంద్రాలు నిర్వహిస్తోంది. బాధితులకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నారు. అమలాపురంలో ఎర్రవంతెన వద్ద ఉన్న వన్‌స్టాప్ కేంద్రాన్ని నేరుగా సంప్రదించి అవసరమైన సేవలు పొందవచ్చు. గడిచిన ఏడాది 51 ఫిర్యాదులు అందగా 37 పరిష్కరించారు.

**వివక్ష రూపుమాపేలా..**

కార్యాలయాల్లో మహిళల పట్ల వివక్షతను రూపుమాపేందుకు జెండర్ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన కార్యాలయాల్లో ఈ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు 110 కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.న్యం

## ఇంధనమేదీ.. మత్స్య సంపదెలా దొరికేదీ..!



**కొత్తపల్లి :** నడి సంద్రంలో రాకాసి అలల నడుమ ప్రాణాలు అరచేత పట్టుకుని కుటుంబాలను పోషించుకునేందుకు పోరాడుతున్న మత్స్యకారులకు సముద్రంలో మత్స్యసంపద చిక్కక రెండేళ్లుగా నిరాశ చెందుతున్నారు. ఇదికాక రెండు నెలలుగా ప్రభుత్వం అందించే డీజిల్ రాయితీ నిలిచిపోవడంతో వారిని మరిన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దాంతో వేట కొనసాగించలేక ఇళ్ల వద్దనే ఉండిపోతున్నారు. చేసేదిలేక వందలాది బోట్లు తీరానికే పరిమితమయ్యాయి.

కాకినాడ జిల్లాలో తాళ్లరేవు నుంచి తుని వరకు సముద్ర తీర ప్రాంతం ఉంది. ఈ ప్రాంత పరిధిలో 25 వేల వరకు మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వీరందరూ సముద్రంలో మత్స్యసంపదను వేటాడుకుని జీవనం సాగిస్తుంటారు. వేట సమయంలో బోట్లకు డీజిల్ పెట్టుబడే అధికం. దాంతో ప్రభుత్వం డీజిల్‌పై లీటరుకు రూ.9 చొప్పున రాయితీ కల్పించింది. నెలకు మోటరైజ్డ్ బోట్లకు 300 లీటర్లు, మెకనైజ్డ్ బోట్లకు 3 వేల లీటర్లకు రాయితీ కల్పించింది. ఏడాదిలో పది నెలలు ఈ రాయితీ వర్తిస్తుంది. మత్స్యకారులకు రాయితీ కల్పించేందుకు జిల్లాలో కొన్ని పెట్రోల్ బంకులను ఎంపిక చేశారు. వీటిలో రాయితీ పొందేందుకు గుర్తింపు పొందిన మత్స్యకారులకు స్మార్ట్ కార్డులను ప్రభుత్వం అందించింది. వీటిని తీసుకెళ్తే రాయితీ డీజిల్ అందిస్తారు. ఇటీవల కొన్ని నెలలుగా రాయితీ పథకం సక్రమంగా అమలు కాకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందిపడుతున్నారు. డీజిల్ ధర భారంతో వేటాడడం కష్టతరంగా ఉంటుండడం, రాయితీ రాకపోవడంతో మరింత ఇబ్బంది కలుగుతుండడంతో వేట నిలిపేశామని మత్స్యకారులు చెబుతున్నారు.

**ఉన్నతాధికారులకు వివరించాం..**

రెండు నెలలుగా మత్స్యకారులకు డీజిల్ రాయితీ రావడంలో ఇబ్బందులున్నాయి. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారం రోజుల్లో రాయితీ వచ్చే అవకాశాలున్నాయి. మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం.

**కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి**

## గత ప్రభుత్వ హయాంలో సిమెంటు, రంగుల పేరిట నిధుల స్వాహా



**కాకినాడ:** కార్పొరేట్‌కు ధీటుగా సకల సౌకర్యాలతో పాఠశాలలను తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం అమలుచేసిన పథకం 'నాడు నేడు'.. ఈ పేరు చెప్పి సిమెంటు కొనుగోలు నుంచి బడికి వేసిన రంగుల వరకు అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మచ్చుకు కొన్ని పాఠశాలల్లో కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ విభాగం (కాగ్) అధికారులు తనిఖీలు చేపట్టగా రూ.లక్షల్లో దోపిడీ వెలుగుచూసింది.

**ఎంతెంత బిల్లులో..**

రామచంద్రపురం మండలంలోని నాలుగు పాఠశాలలకు రంగులు వేసిన గుత్తేదారుకు రూ.1.52 లక్షలు అదనంగా చెల్లించారు.

రాజమహేంద్రవరం గ్రామీణం తొర్రేడు ఎస్సీకాలనీ పాఠశాల పెయింటింగ్ బిల్లులో రూ.1.04 లక్షలు ఉదారంగా ఇచ్చేశారు. తూర్పు, కోనసీమ జిల్లాల్లో 22 పాఠశాలలు తనిఖీచేస్తే రంగుల్లోనే రూ.15.82 లక్షలు దుర్వినియోగం జరిగింది.

**సిమెంట్‌లోనూ చక్కబెట్టేశారు..**

నాడు-నేడు పనులకు అప్పటి ప్రభుత్వమే తమ అనుంగ కంపెనీల నుంచి సిమెంటు సరఫరా చేసేది. సరకు జాప్యం జరిగినప్పుడు స్థానికంగా పాఠశాల తల్లిదండ్రుల కమిటీల ఆధ్వర్యంలో కొనుగోలుకు అవకాశం కల్పించారు. ఇదే అదనుగా వారు సిమెంట్ బిల్లుల్లోను చక్కబెట్టేశారు.

తూర్పుగోదావరి జిల్లాలోని 15 పాఠశాలలకు 2,046 సిమెంటు బస్తాలను స్థానికంగా కొన్నారు. రూ.4.81 లక్షలు బిల్లు చూపాలి. రూ.7.04 లక్షలు చెల్లించినట్లు దస్త్రాల్లో ఉంది.

## లింగ సమానత్వంతో మహిళా సాధికారిత

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** లింగ సమానత్వం ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని అదనపు జిల్లా న్యాయమూర్తి యం.మాధురి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో మహిళా సాధికారత, హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో మహిళలు పోషించే పాత్ర అత్యంత ముఖ్యమని, నేడు అన్ని రంగాల్లో మహిళలు విశేషంగా రాణిస్తున్నారన్నారు. అయితే ఇంకా కొన్ని సందర్భాల్లో మహిళలపై వివక్ష కొనసాగుతోందని, ఆ వివక్షను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ ముఖ్యంగా పురుషులు ముందుకు రావాలన్నారు. మహిళలు, చిన్నారులకు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కోర్టు ప్రాంగణంలో అందుబాటులో ఉందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నప్పటికీ ఇంకా అఘాయిత్యాలు కొనసాగుతున్నాయన్నారు. మార్పు ఇంటి నుంచే ప్రారంభం కావాలని, ఆడపిల్లలలో ధైర్యం నింపడంతో పాటు మగపిల్లలకు మహిళలను గౌరవించడం నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీలలో ఎస్‌కేఆర్ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఆర్ఎంసీ ఎంహెచ్‌వో వి.వినూత్న, న్యాయాధికారులు, న్యాయవాదులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆమె చేయి పడితే కంటి చూపు ఖాయం

**నిడదవోలు :** పట్టణంలో లయన్స్ కంటి ఆసుపత్రిలో పదమూడేళ్లుగా నేత్ర వైద్యురాలిగా పనిచేస్తున్న గొల్లపల్లి భరణి ఎల్లార్ తన కంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. ఆమె చేయి వేస్తే కంటి చూపు వస్తుందనే నమ్మకం వృద్ధుల్లో కలిగింది. ఇప్పటి వరకు ఆమె 38,596 కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు 2 లక్షల మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాల్లో సైతం పాలు పంచుకుంటారు. రోగుల పట్ల ఎంతో ప్రేమగా మాట్లాడుతుంటారు. 1974లో కొవ్వూరులో జన్మించారు. 1999లో విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, పీజీ పూర్తి చేశారు. వృత్తి పట్ల అంకిత భావం, పేదలకు ఉచిత వైద్య సేవలందించడంలో తనదైన ముద్ర వేశారు. గుర్తింపుగా విశ్వగురు వరల్డ్ రికార్డు నుంచి రోనా వారియర్స్ అవార్డును కూడా సొంతం చేసుకున్నారు.

## తరుణి తలపు.. ధరణి గెలుపు

**గాంధీనగర్, మసీదు సెంటర్ (కాకినాడ):** ఆమె.. ఇంటికి పరిమితం కాదు. ఇంతింతై గెలిచే పరిణతికి రూపం. తనను తాను మార్చుకోవడంలో ప్రకృతికి సమానురాలు. ఎంచుకున్న రంగంలో రాణించేందుకు నిత్యం అగ్నికణమై రగిలే కార్యసాధకురాలు. అందుకే ప్రతిచోటా ఆమే విజేత. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా కొందరు విజేతల గురించి కథనం.

**ప్రధాని సమక్షంలో పరేడ్‌లో పాల్గొన్నా**



నేను కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. మాది కరప మండలంలోని వేములవాడ. డిఫెన్స్‌లో చేరి దేశానికి సేవచేయాలనే లక్ష్యంతో రెండేళ్లుగా ఎన్‌సీసీ 6(ఏ) నేవల్ విభాగంలో చేరా. ఆంధ్రప్రదేశ్ తరఫున మహిళా విభాగం నుంచి నేను మాత్రమే దిల్లీలో ప్రధాని మోదీ పాల్గొన్న రిపబ్లిక్ డే క్యాంప్ పరేడ్‌లో పాల్గొనడం గర్వంగా ఉందని చెబుతున్నారు కాకినాడకు చెందిన విద్యార్థిని పి.శ్రావ్య.

**నిత్యం నేర్చుకుంటే ఏదైనా సాధ్యమే..**



జేఎన్‌టీయూకే యూసీఈకే కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్‌లో పనిచేస్తున్న లింగంగుంట సుమలత బోధన, పరిశోధనలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈమె పరిశోధన ఆసక్తిరంగాలు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-మెషిన్ లెర్నింగ్. 2021 నుంచి 2024 వరకు జేఎన్‌టీయూకే తొలి మహిళా రిజిస్ట్రార్‌గానూ పనిచేశారు. ఆమె మార్గనిర్దేశంలో 9 మంది పీహెచ్‌డీలు సాధించారు. 80 మందికిపైగా పీజీ విద్యార్థులు పరిశోధనలను పూర్తిచేశారు. భారత ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ నుంచి విద్యారత్న, మేక్ స్టెమ్ ఎడ్యువర్సిటీ నుంచి రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు, కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్సీస్ నుంచి లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డ్ ఫర్ అకడమిక్ లీడర్‌షిప్ తదితరాలెన్నో వరించాయి. గిరిజన విద్యార్థి గుండె శస్త్రచికిత్సకు ఆర్థిక సాయమూ చేశారు. నిత్యం విద్యార్థిలా నేర్చుకుంటే.. మహిళలు అనుకున్నది సాధిస్తారని చెబుతున్నారు.

**ప్రత్యేక గుర్తింపు అవసరం..**



కాకినాడకు చెందిన వారణాసి అరుణరేఖ నాట్యాచార్యుడు కృష్ణకుమార్ శిష్యురాలు. ఈమె 40 ఏళ్లుగా నిత్య విద్యార్థినిగా ఉంటూనే జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రతిభతో ప్రేక్షకులు, పండితులను అలరింపజేస్తున్నారు. తల్లిదండ్రులు వారణాసి భాస్కరరావు, సత్యవాణిల ప్రోత్సాహంతో నాట్యం చేస్తూనే ఎంబీఏ పూర్తి చేశారు. దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన విద్వత్సభల్లో నాట్యంచేసే అవకాశాన్ని ఉభయగోదావరి జిల్లాల నుంచి అందిపుచ్చుకున్న తొలి నర్తకిగా అరుణరేఖకు పేరుంది. శోభానాయుడు వంటివారు పొందిన సింగారమణి అవార్డునూ గెలుచుకున్నారు. మద్రాస్‌లో ప్రదర్శనకు గిన్నిస్ రికార్డు పొందారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణతో కలిసి 8 దేశాల్లో నృత్యప్రదర్శనలు చేశారు. ప్రతి మహిళకూ ప్రత్యేక గుర్తింపు అవసరమని అంటారీమె.

**భారత పతాక ఎగరంగా.. గర్వంగా..**




కిలిమంజారోపై జాతీయ జెండా చూపుతున్న పద్మజ

కాకినాడకు చెందిన వ్యాపారి కిషోర్ ధర్మపత్ని వాడకట్టు పద్మజ 2023లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని వారం రోజుల్లో అధిరోహించారు. 2025లో యూరప్ ఖండంలోని ఎత్తైన మౌంట్ ఎల్‌బ్రూస్ శిఖరంపై భారత పతాక ఎగురవేశారు. సాధారణ గృహిణిగా ఉండే తాను ఏదైనా సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని చెబుతున్నారు. భయం వీడి బలాన్ని గుర్తిస్తే ఏదైనా సాధించగలమని చెబుతున్నారీమె. ఫిట్‌నెస్‌కోసం మొదలుపెట్టిన ప్రయాణం కాస్తా పర్వతారోహణలో రాణించేలా చేస్తున్నాయని, మహిళలను కుటుంబసభ్యులు ప్రోత్సహిస్తే వయసుతో సంబంధం లేకుండా ఇష్టమైన రంగాల్లో రాణించి తీరుతారని పద్మజ చెబుతున్నారు.

# క్రీడా సినిమా సమాచారమ్

## 'సరస్వతి' స్టోరీ వివాదంపై వరలక్ష్మీ కౌంటర్!



తమిళంలో పవర్ ఫుల్ క్యారెక్టర్లతో హీరోయిన్‌గా, నటిగా మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న నటి వరలక్ష్మీ శరతక్ కుమార్. తొలి సారి ఆమె మెగా ఫోన్ పట్టి, నిర్మాతగా మారి రూపొందించిన మూవీ -సరస్వతి-. రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీ ప్రేక్షకుల్ని ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక యావరేజ్ మూవీ అనిపించుకుంది. ఈ చిత్రానికి టాలీవుడ్ స్టార్ రైటర్ సాయి మాధవ్ బుర్రా కథ అందించారు. అయితే ప్రమోషన్స్‌లో ఆయన పేరు ఎక్కడా వాడలేదని, తన కథని -రేలిప్- చేశారని, తను ఇచ్చిన కథతో సినిమా ప్రారంభించి చివర్లో కొత్త కథని యాడ్ చేసి ఖూనీ చేశారని సోషల్ మీడియా వేదికగా ఆయన ఫైర్ అయ్యారు.

దీంతో వరలక్ష్మీ శరత్ కుమార్ నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన -సరస్వతి- టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఈ నేపథ్యంలోనే చిత్ర బృందం శనివారం సక్సెస్ మీట్ ని నిర్వహించింది. ఈ సందర్భంగా సాయి మాధవ్ బుర్రా చేసిన ఆరోపణలపై వరలక్ష్మీ శరత్‌కుమార్ స్పందించింది. సాయి మాధవ్ బుర్ర నా స్టోరీని రేప్ చేశారంటూ కామెంట్ చేశారు. అసలు ఆయన అంతగా రియాక్ట్ కావడం వెనుక ఏం జరింది? అని అడిగితే వరలక్ష్మీ శరత్‌కుమార్ ఆసక్తికరంగా స్పందించింది. సాయిగారి మీద నాకు చాలా మర్యాద, గౌరవం ఉన్నాయి అన్నారు.

ఆయనొక సీనియర్ రైటర్. తనంటే నాకు చాలా రెస్పెక్ట్ ఉంది. అయితే ప్రపంచంలో ఓ కథని అలాగే చెబితే ప్రేక్షకులు యాక్సెప్ట్ చేయరు. వాళ్లకు నచ్చదు. అది నిజం. సో నేను ఎవరి కథని దొంగిలించలేదు.. కాంట్రాక్ట్ చేసుకున్నాం. డబ్బులిచ్చాం. అన్నీ ఇచ్చిన తరువాత ఆ కథ నాదైంది. ఆ కథ సాయి మాధవ్ బుర్రగారి వద్ద గత ఆరేళ్లుగా ఉంది. అంత బాగుంటే ఆయనే ఎందుకు చేయలేదు. అంటే అందులో ఏదో ల్యాగ్ ఉంది. నేను కథ చెప్పిన ప్రతీ చోట నాకొచ్చిన ఫీడ్ బ్యాక్ ఏంటంటే సెకండ్ హాఫ్ బాగాలేదు. ఓకే జనరల్‌గా రైటర్స్ మీతో పాటు కూర్చుని వర్క్ చేయాలని చెబుతారు.

కావాలంటే నా పేరు రాసుకోవచ్చు. నా పేరు రాయకుండా ఆయన పేరుని ఆయనపై ఉన్న మర్యాదతో మాత్రమే ఆయన పేరు వేశాను. ఇప్పుడు కామెడీ ఏంటంటే కథ ఆయనది చాలా బాగుందని ట్యాగ్ చేస్తున్నారు. అది ఆయనకు దక్కిన గౌరవమా? నాకు దక్కిన గౌరవమా? మీరే చెప్పాలి.. అదే నా లాజిక్- అన్నారు. అయితే ఆయన స్టోరీ తీసుకున్నప్పుడు ఆయనకు చెప్పకుండా మార్చకూడదు కాదా? అని అడిగితే .. ఆయన ఫోన్‌లో దొరికితే కాదా అని ఎదురు ప్రశ్నించారు వరలక్ష్మీ. మరి ఆయన కథ లేదు అన్నప్పుడు ఇది వేరే అవుతుంది కాదా? అని మీడియా అడిగితే.. ఆయనపై ఉన్న గౌరవంతో స్టోరీ సాయి మాధవ్ బుర్రా అని వేశానని తెలిపింది. అంతే కాకుండా నేను కథ చెప్పిన ప్రతీ ఒక్కరూ సెకండ్ హాఫ్ చాలా ల్యాగ్ ఉందని, పెద్ద స్టార్‌ని పెట్టుకుని ఇలాంటి కథతో సినిమా చేస్తే ఫరవాలేదు. మేమంతా గుడ్ యాక్టర్స్..నాట్ స్టార్స్. కాబట్టి అలాంటి కథని మేం జనాల మధ్యకు ఎలా తీసుకువెళ్లాలి? అనే దానిమీద మేం వర్క్ చేశాం. చాలా వర్క్ చేశాం. ఆ సమయంలో ఎప్పుడూ ఆయన రానేలేదు. కారణం నాకు పెద్ద సినిమాలు ఉన్నాయన్నారు. ఓకేసారి మీరు బిజీగా ఉన్నారు నేను చూసుకుంటాను అని ఒప్పుకున్నాను. అలా నేను సెన్సిటీవ్ ఇష్యూమీద సినిమా తీస్తే కథని -రేప్- చేశారంటూ కామెంట్ చేయడం ఏమీ బాగాలేదు. చాలా ఇన్‌సెన్సిటీవ్‌గా ఉంది.

## ఉస్తాద్ పెంచుతాడా? తగ్గుతాడా?



తెలుగు సినిమా టికెట్ ధరలు ఎప్పుడూ పెరుగుతూనే ఉంటాయి. అందులోనూ స్టార్ హీరోల సినిమా టికెట్ ధరల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. సినిమా సినిమాకు టికెట్ ధర అమాంతం పెంచేస్తారు. బ్లాక్ మార్కెట్ ధర గురించైతే చెప్పాల్సిన పనిలేదు. రెండు..మూడు..నాలుగు వేలు అంటూ ఎంతకైనా డిమాండ్ ను బ్లాక్ మార్కెట్ దందా నడుస్తుంది. టికెట్ ధర పెంచడానికి రకరకాల కారణాలు చెబుతుంటారు. ప్రముఖంగా సినిమా బడ్జెట్ ఆధారంగానే పెంచుతున్నామనే అంశం తెరపైకి వస్తుంది. ఇదంతా అందరికీ తెలిసిందే.

అయితే త్వరలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. మార్చి 26 రిలీజ్ అనుకున్నారు. కానీ అంతకన్నా ముందే మార్చి 19 సినిమా రిలీజ్ అయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో టికెట్ ధర అంశం తెరపైకి వస్తోంది. ఈ సినిమాకు ఉస్తాద్ భగత్ సింగ్ నిర్మాతలు టికెట్ ధర పెంచుతారా? లేక పాత ధరల ప్రకారం రిలీజ్ చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో టికెట్ ధరలపై సన్నివేశం ఇలా ఉంది. టికెట్ ధరల పెంపు పై రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

సినిమా విడుదలకు 90 రోజుల ముందే టికెట్ ధరల పెంపు ఉత్తర్వులు ఇవ్వాలని అందులో పేర్కొంది. మరి ఈ రకమైన ముందొస్తు అనుమతి ఉస్తాద్ భగత్ సింగ్ సంపాదించాడా? లేదా? అన్నది క్లారిటీ లేదు. ఏపీలో అయితే టికెట్ ధరలు పెంచుకోవడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. రిలీజ్ కుముందు రోజైనా పెంపు అమలులోకి వచ్చేస్తుంది. పవన్ గత రెండు సినిమాలు పెంచిన టికెట్ ధరలతోనే రెండు సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కొన్ని విమర్శలు కూడా వ్యకమయ్యాయి. టికెట్ ధరలు మరీ ఇంతలా పెంచేస్తే సామాన్యుడికి భారం కదా? అన్న అంశం తెరపైకి వచ్చింది.

ఈ నేపథ్యంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' టికెట్ ధరలపై ఆ ప్రభావం ఎలా ఉంటుంది అన్నది చూడాలి. మార్చి 19న -ధురంధర్ 2- ఎలాంటి టికెట్ ధరలు పెంచకుండానే రిలీజ్ అవుతుంది. పాన్ ఇండియాలో ఆ సినిమా ఎలాంటి టికెట్ హైక్ లేకుండా రిలీజ్ అవుతున్నప్పుడు ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పదవిలో ఉన్న పవన్ సినిమా టికెట్ ధరలు పెంచకుండా రిలీజ్ చేయలేరా? అన్న ప్రశ్న ఉత్పన్న మవుతుంది. ఇది పవన్ కళ్యాన్ ని ఇరకాటంలో పెట్టేసే అంశంమే. గతంలో 'కల్కి' సినిమా రిలీజ్ సమయంలో టికెట్ ధరలు 1000 రూపాయలు పెంచుకోండని పవన్ చెప్పినట్లు నిర్మాత అశ్వినీ దత్ అన్నారు. కానీ అంత ధర పెట్టడం న్యాయం కాదని భావించి పెట్టలేదన్నారు. ఈ విషయంలో పవన్ పై అప్పట్లోనూ వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే.

## దళపతి విజయ్‌కి భార్య నుంచి మరో షాక్!



కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్‌కి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. సినిమాలకు గుడ్ బై చెప్పేసి రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న ఆయనపై ముప్పేట దాడి జరుగుతోంది. ఆయన నటించిన చివరి సినిమా -జన నాయగన్- జనవరి 9న రిలీజ్ కావాల్సింది. ఈ సినిమాతో రాజకీయాల్లో సంచలనం సృష్టించాలని ప్లాన్ చేసుకున్న విజయ్‌కి తీవ్ర నిరాశే ఎదురైంది. సెన్సార్ అభ్యంతరాలు చెప్పడం, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడానికి షరతులు విధించడంతో సినిమా రిలీజ్ అర్థాంతరంగా నిలిచిపోయింది.

ఇదే సమయంలో విజయ్ టీవీకే పార్టీ ప్రచారంలో భాగంగా కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరగడం, అందులో పిల్లలు, పెద్దలు, మహిళలు, యువకులు దాదాపుగా 40 మందికి పైగా మృతి చెందడంతో విజయ్ పొలిటికల్ ఎంట్రీ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు కావడం, భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరగడంతో సీబీఐ రంగంలోకి దిగి విచారణ చేపట్టడంతో విజయ్‌కి కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. పార్టీ జెండాపై కూడా వివాదం చెలరేగడంతో ఈ అంశం కోర్టు దాకా వెళ్లింది.

హైకోర్టు తీర్పు ఇచ్చే వరకు విజయ్ పార్టీ జెండాకు ఎలాంటి ఇబ్బంది లేదు కానీ అనుకూలంగా తీర్పు రాకపోతే మాత్రం పార్టీ జెండా మార్చుకోక తప్పని పరిస్థితి. ఇదే సమయంలో విజయ్‌పై తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి తెరతీసి విజయ్‌ని ఇరుకున పెట్టాయి. త్రిష ఇంటి నుంచి విజయ్ బయటికి వస్తే బాగుంటుందని బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఇదే సమయంలో విజయ్‌పై మరో బాంబు పడింది. ఆయన భార్య సంగీత విజయ్ నుంచి విడాకులు కోరుతూ చెంగల్‌పట్టు జిల్లా ఫ్యామిలీ కోర్టుని ఆశ్రయించడం సంచలనంగా మారింది.

ఒక నటితో విజయ్ వివాహేతర సంబంధమే విడాకులకు కారణమంటూ విడాకుల పిటీషన్‌లో సంగీత పేర్కొనడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. 27 ఏళ్ల వైవాహిక బంధానికి సంగీత ముగింపు పలకడంతో కోలీవుడ్ తో పాటు దక్షిణాది అంతా షాక్‌కు గురవుతోంది. ఇంత వరకు దీనిపై విజయ్ ఎలాంటి కామెంట్ చేయకపోవడం, రీసెంట్‌గా జరిగిన ఓ వివాహ వేడుకలో త్రిషతో కలిసి పాల్గొనడంతో విడాకుల వివాదం మరింత ముదిరే అవకాశం ఉందని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.

## అభిషేక్, సంజూ ఊచకోత.. బౌలర్లకు రక్త కన్నీరు!




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఫైనల్లో భారత బ్యాటర్లు దుమ్మురేపారు. సంజూ శాంసన్(46 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సలతో 89), అభిషేక్ శర్మ(21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సలతో 52), ఇషాన్ కిషన్(25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 54) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దాంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. చివర్లో శివమ్ దూబే(8 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 26 నాటౌట్) మెరుపులు మెరిపించాడు.

న్యూజిలాండ్ బౌలర్లలో జేమ్స్ నీషమ్(3/38) మూడు వికెట్లు తీయగా.. మ్యాట్ హెన్రీ ఒక వికెట్ తీసాడు. భారత బ్యాటర్ల ధాటికి న్యూజిలాండ్ బౌలర్లకు ఏడుపు ఒక్కటే తక్కువైంది. ఈ టోర్నీలో భారత్ మూడోసారి 250 ప్లస్ స్కోర్ నమోదు చేసింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్ చరిత్రలో ఇదే అత్యధిక స్కోర్.

చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మచరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ

**అభిషేక్ విధ్వంసం..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. ఆరంభంలో కాస్త సమయం తీసుకున్న ఈ జోడీ ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగింది. పోటా పోటిగా బౌండరీలు బాదింది. ఈ క్రమంలోనే అభిషేక్ శర్మ 18 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్స్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ బాదిన ఆటగాడిగా నిలిచాడు.

ఈ ఇన్నింగ్స్‌తో తన పేలవ ఫామ్‌కు చెక్ పెట్టాడు. అభిషేక్-సంజూ విధ్వంసంతో భారత్ పవర్ ప్లేలో వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసింది. ఈ టోర్నీలో పవర్ ప్లేలో భారత్ చేసిన అత్యధిక పరుగులు ఇవే. క్రీజులో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని రచిన్ రవీంద్ర విడదీసాడు. వైడ్ బాల్‌తో అభిషేక్ శర్మను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 98 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

**సంజూ, ఇషాన్ ఊచకోత..**

అభిషేక్ ఔటైనా.. ఇషాన్ కిషన్‌తో కలిసి సంజూ శాంసన్ చెలరేగాడు. మిచెల్ సాంట్నర్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన సంజూ వరుసగా మూడో హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఆ తర్వాత ఫెర్గూసన్ బౌలింగ్‌లో సంజూ రెండు సిక్సలు, ఫోర్ కొట్టగా.. ఇషాన్ ఓ సిక్స్ బాదాడు. రచిన్ రవీంద్ర వేసిన 14వ ఓవర్లలో సంజూ శాంసన్ హ్యాట్రిక్ సిక్సలు బాదగా.. మిచెల్ సాంట్నర్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ 6, సింగిల్ తీసి 23 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

సెంచరీకి చేరువైన సంజూ శాంసన్‌ను ఫుల్‌టాస్‌తో జేమ్స్ నిషమ్ పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 105 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అయితే ఇదే ఓవర్‌లో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(0) దూకుడుగా ఆడే క్రమంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగారు. దాంతో భారత్ పరుగుల వేగం తగ్గింది. హెన్రీ వేసిన 19వ ఓవర్‌లో భారీ సిక్సర్ బాదిన హార్దిక్.. మరుసటి బంతికే క్యాచ్ ఔట్ అయ్యాడు. ఆఖరి ఓవర్‌లో శివమ్ దూబే.. 4, 6, 6, 4, 0, 4 బాది 24 పరుగులు పిండుకున్నాడు. దాంతో భారత్ 255 పరుగుల భారీ స్కోర్ చేసింది.

## చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ




టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఫైనల్లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఫైనల్లో అభిషేక్ శర్మ ఈ ఫీట్ సాధించాడు.

ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. పేలవ ఫామ్‌తో ఈ టోర్నీ ఆసాంతం తడబడిన అభిషేక్ శర్మ.. అసలు సిసలు ఫైనల్లో తన సత్తా ఏంటో చూపించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో విమర్శకుల నోళ్లు మూయించాడు. క్రీజులో సెట్ అయ్యేందుకు కాస్త సమయం తీసుకున్న అభిషేక్ శర్మ.. 6 ఫోర్లు, 3 సిక్సలతో 18 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

అప్పుడు గుండె ఆగినంత పనైంది: శివమ్ దూబేఅప్పుడు గుండె ఆగినంత పనైంది: శివమ్ దూబే తద్వారా హెన్రిచ్ క్లాసెన్ పేరిట ఉన్న రికార్డ్‌ను అధిగమించాడు. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో హెన్రిచ్ క్లాసెన్ 23 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఇప్పటి వరకు టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఇదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ కాగా.. తాజా ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ అధిగమించాడు. అభిషేక్ శర్మ ధాటికి ఈ మ్యాచ్‌లో టీమిండియా పవర్ ప్లేలో వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర బౌలింగ్‌లో అభిషేక్ శర్మ వెనుదిరిగినా.. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్నారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. టాప్-3 బ్యాటర్లు సంజూ శాంసన్(46 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సలతో 89), అభిషేక్ శర్మ(21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సలతో 52), ఇషాన్ కిషన్(25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 54) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెలరేగారు. చివర్లో శివమ్ దూబే(8 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 26 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమ్స్ నీషమ్(3/46) మూడు వికెట్లు తీయగా.. మ్యాట్ హెన్రీ, రచిన్ రవీంద్ర చెరో వికెట్ తీసారు. భారత బ్యాటర్ల ధాటికి న్యూజిలాండ్ బౌలర్లకు ఏడుపు ఒక్కటే తక్కువైంది. ఈ టోర్నీలో భారత్ మూడోసారి 250 ప్లస్ స్కోర్ నమోదు చేసింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్ చరిత్రలో ఇదే అత్యధిక స్కోర్.

## తెలుగు హీరోయిన్‌తో పృథ్వీ షా ఎంగేజ్‌మెంట్!





టీమిండియా ఓపెనర్ పృథ్వీ షా తన జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నాడు. సుదీర్ఘకాలంగా ప్రేమలో ఉన్న తన స్నేహితురాలు, నటి ఆకృతి అగర్వాల్‌తో ఆదివారం(మార్చి 8) నిశ్చితార్థం చేసుకున్నాడు. తన ఎంగేజ్‌మెంట్ విషయాన్ని పృథ్వీ షానే ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు.

'మైదానంలో సిక్సర్ల నుంచి మైదానం బయట జీవితకాల హిట్స్ వరకు.. ఆమె నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్!' అనే క్యాప్షన్స్‌తో ఎంగేజ్‌మెంట్ ఫోటోలు పంచుకున్నాడు. ఈ ఫోటోల్లో పృథ్వీ షా మోకాళ్లపై కూర్చొని తన ప్రియురాలి చేతికి ఎంగేజ్మెంట్ రింగ్ తొడిగాడు. ఎంగేజ్‌మెంట్ చేసుకున్న పృథ్వీషాకు సోషల్ మీడియా వేదికగా పలువురు క్రికెటర్లు, సెలెబ్రిటీలు అభినందనలు తెలుపుతున్నారు.

**ఎవరీ ఆకృతి అగర్వాల్?**

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఆకృతి అగర్వాల్.. ప్రస్తుతం ముంబైలో నివసిస్తున్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా, నటిగా రాణిస్తోంది. ముంబైలోని నిర్మలా మెమోరియల్ ఫౌండేషన్ కాలేజీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డిగ్రీని పూర్తి చేసింది.

అంతా టీమిండియా వల్లే: ఫిన్ అలెన్ అంతా టీమిండియా వల్లే: ఫిన్ అలెన్ కరోనా సమయంలో డ్యాన్స్, లిప్ సింక్ వీడియోల ద్వారా సోషల్ మీడియాలో పాపులారిటీ సంపాదించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 3.4 మిలియన్ల (34 లక్షలు) కంటే ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆమెకు ఓ యూట్యూబ్ ఛానెల్ కూడా ఉంది. రాజేష్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'త్రిముఖ' అనే తెలుగు సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాతో ఆమె హీరోయిన్‌గా పరిచయం కాబోతుంది.

**కొన్నాళ్లు డేటింగ్..**

పృథ్వీ షా, ఆకృతి అగర్వాల్ గత కొంతకాలంగా పీకల్లోతు ప్రేమలో ఉన్నారు. బాహటంగానే తిరిగిన ఈ ఇద్దరూ సోషల్ మీడియా వేదికగా కూడా ఫొటోలు షేర్ చేశారు. ఇటీవల అర్జున్ టెండూల్కర్ వివాహ వేడుకలో పృథ్వీ షా, ఆకృతి కలిసి హాజరయ్యారు. అర్జున్ పెళ్లి జరిగిన కొద్ది రోజుల్లోనే పృథ్వీ తన ఎంగేజ్‌మెంట్ వార్తను పంచుకోవడం విశేషం. ఐపీఎల్ 2026 సీజన్ తర్వాత పృథ్వీ షా, ఆకృతి పెళ్లి జరిగే అవకాశం ఉంది. అప్‌కమింగ్ సీజన్‌లో పృథ్వీ షా ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడనున్నాడు. అండర్ 19 ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌లోకి దూసుకొచ్చిన పృథ్వీ షా అంతే వేగంగా జట్టుకు దూరమయ్యాడు. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో పాటు చెడు స్నేహాలు పృథ్వీ షా కెరీర్‌ను నాశనం చేశాయి. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలంలో అతను అన్‌సోల్డ్‌గా నిలిచాడు. దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టు నుంచి తప్పుకున్న పృథ్వీ షా మహారాష్ట్ర తరఫున తన ప్రయాణాన్ని ఘనంగా ప్రారంభించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రాణించడంతో పృథ్వీ షాను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.75 లక్షల అతని కనీస ధరకు కొనుగోలు చేసింది.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com